...యై నమః

...వతంస

శ్రీ రాజా

వేంకటకృష్ణారావు బహద్దరువారి జీవితము


FEAR NONE BUT GOD

‘శ్రీనాథునకుం దక్క నెవ్వరికేని
భయ మందఁగల దంచుఁ బలుకువాఁడు’

గ్రంథకర్త:

వాజపేయయాజుల రామసుబ్బారాయఁడు, బి. ఏ.,
కొల్లాపురము
శ్రీజటప్రోలు రాజసంస్థానము

1937



SREE RAJAH
INUGANTY VENKATA KRISTNA RAO
Bahadur Varu
Zamindar of TIRUPACCHUR ESTATE
Born 30-5-1899

ఓం

తొలిపలుకు

విషాదాంత మగునీజీవితచరిత్రకుఁ దొలిపలుకు వ్రాయుపని నాపయిఁ బెట్టఁబడుట దురదృష్టఫలము. ఇది నా కనభిమతమయ్యు గ్రంథకర్త్రుస్నేహలతావృతుఁడనై యనుమతింపక తప్పినది గాదు. ఎట్టి స్వీయాపద్విషమపరిస్థితులందేని గన్ను తడిగానీక సహించుకొను కఱుకుఁదన మవలంబించుటకుఁ గొంతయభ్యాసపడినను బరాపద్విషమపరిస్థితులయెడ మాత్రము నేను బొత్తిగఁ బరిహాసపాత్రుఁడనే. గ్రంథస్థములగునల్పప్రాణివికటావస్థలం బ్రత్యక్షీకరించుకొని తడవు దురపిల్లు నేను, స్మరణమాత్రముననె ముహుర్ముహుర్విశ్చేష్టతం గలిగించుచు నొకయెడ నూర్ధ్వలోకమునకును, మఱొకయెడ నధోలోకమునకును లాగికొనిపోవుచు ననంతచింతాడోలికల నూచివైచు నేతత్కృతికి నిజప్రకృతివిరుద్ధముగఁ దొలిపలుకునిబంధించునంతకఱుకుఁదన మెట్లవలంబింపఁగలనాయని యేమియుఁ దోఁచక బహుదివసములు పడియుంటిని. బుద్ధి స్తంభించెను. మతి చెడినట్లయ్యె. దిక్కుం దెరువులు గానఁబడవయ్యె. బలాత్కారముగఁ బట్టినలేఖిని బట్టు సడలి పడిపోఁదొడఁగె. ఒప్పించి నన్నూఱడింపఁగలవా రెవరు? సుఖులమని భ్రమించుసఖు లందఱును దుఃఖులే యైయుండ వారా నన్నాశ్వాసించువారు? కొలఁదిదివసములకు నా

సమయములును, బట్టఁజాలక యేకాంతమున నేకధారగఁ
గన్నీరు గార్చిన యవసరములును, వావిడిచి హాహారుస
విలపించిన సందర్భములును, గాలుసేతు లాడక కఱ్ఱవారి
పోయిన గడియలును, నుత్కంఠాభరమునఁ గంఠము కుం
ఠితమైన మూర్తములును, నుచ్ఛ్వాసనిశ్వాసములు నిలిచి
పోయి యుక్కిఁరిబిక్కిఁరియైన యవకాశములును బట్టబయలై
పట్టరాని విచారమును గలిగించకపోవు. నిగ్రహసమర్థు
లగు సుబ్బారాయఁడుగా రిన్ని దురవస్థల దురపిల్లుచుంగూడఁ
గావ్యమర్యాదానుసారముగఁ గొన్ని ఘట్టములను గల్పించి,
నాయకమణి చరిత్రమును బాల్యప్రభృతి పర్యవసాన
పర్యంతముఁ బెంపొందించి, దైవ మనుల్లంఘనీయ మనియు,
నెట్టి పురుషకారమును దానికి లొంగిపోక తప్ప దనియు,
సుకృతులకు సర్వార్థసమృద్ధి పిన్నతనముననే సిద్ధించు
ననియు, సత్యక్షమాశీలుఁ డగువిక్రమసంపన్నుఁ డతఁడు
ప్రతిష్ఠం గాంచు ననియు, బహుపండితకవిమిత్రుఁ డమృ
తత్వముం బడయు ననియు- నిట్లెన్నియో మహార్హవిషయవిశే
షముల ధ్వనింపఁజేయుచుఁ దమకృతినిర్మాణకౌశలముఁ
జూపిరి. వీరు జటప్రోలు సంస్థానమున గురూద్యోగపదవిం
బడసినది మొదలు కీ. శే. శ్రీరాజా సురభి లక్ష్మారాయ
ప్రభుచంద్రులయొక్కయుఁ, బిదప శ్రీశ్రీశ్రీ మహారాజ్ఞిరత్న
మాంబాసతీమతల్లి యొక్కయు, మఱియు శ్రీకుమారరాజా వేం
కటజగన్నాథరావు బహదరుగారియొక్కయు సంపూర్ణాదర
గౌరవములచేతను, గృపావలోకనములచేతను దమ సహజ
భాషాసేవాసక్తిని బెంపొందించి, మిత్రలేఖవ్యాప్తిచే బహు

గావింపఁబడినకావ్యము లన్నియు మఘలోఁ బొడమి పుబ్బలో నడఁగు పుట్టకొక్కులవలె నింద్యములై క్షణికములై యధమాధమములుగ నధఃకరింపఁబడునని వేఱ వచింపనేల?

సంప్రదాయరహస్యోపచితముగ శ్రద్ధాభక్తుల వాగ్దేవతోపాసనగావించుమహాకవులకు సన్నాయకరత్నప్రాప్తియే తపఃఫలము. దాననే వారికి రససిద్ధి. దాననే వారికిఁ జిరంజీవిత్వప్రసిద్ధి. దాననే వారికి జరామరణభయానవిద్ధయశశ్శరీరలబ్ధి. వాల్మీకికి శ్రీరామచంద్రమూర్తియు, వేదవ్యాసులకు శ్రీకృష్ణపరమాత్మయుఁ, గాళిదాసునకు దిలీపరఘురామ ప్రముఖమహారాజరాజియుఁ దత్తత్ప్రబంధనాయకమణులుగ దొరకుట తత్సారస్వతతపఃఫలసిద్ధిగాక వేఱేమి? వారలనిర్మాణకౌశల మెంతయపూర్వముగ నుండినను నట్టి పుణ్యశ్లోకనాయకసిద్ధియే గలుగకుండిన వారలమహాకావ్యములకు, ముం దెట్లుండఁబోయినను, నాఁటినుండి నేఁటివఱకు నింతటిగౌరవాదరము లుండునా ? ఇట్టి సనాతనపరంపర నాదర్శముగఁ గొనువా రేనాఁటికిని ధన్యులే. బ్ర. రామసుబ్బారాయఁడుగారిట్టికోటిలోఁ జేరినధన్యు లగుటయేగాక స్వాభివర్ణితనాయకమణికి సాక్షాన్మాననీయులును, దత్ప్రియాపత్యగురువులు నగుట ధన్యతము లనఁదగు.

కావ్యసృష్టి బ్రహ్మాండసృష్టివలె విశిష్టానల్పపదార్థశిల్పోత్కృష్టమై, యచింత్యావ్యక్తరచనా ప్రపంచితమై, నానాభూతకళాకల్పమై, రసజ్ఞానందకందమై, యనాద్యనంతమై యొప్పుచుండు. ఏతదారంభపరిణామాది వాదోపవాద

లైనను దమ్మెంబోలు ననుత్పన్నమతులకు శ్లాఘాపాత్రు లయినను దోషజ్ఞులకుఁ బరిహాసపాత్రులు కాకపోరు. శ్రీ రామసుబ్బారాయఁడుగా రేతద్రిహాస్యసాంగవిదులని శ్లాఘించుట కేతత్సత్కృతియే సంపూర్ణనిదర్శనము. ఇట్లగు టనే యీనవ్యకావ్య మొకవైలక్షణ్యముం గలిగి యెంతయు శోభించుచున్నది.

ఈగ్రంథకర్త స్వీయానుభవమున సంతరించిన యీ కృతి మహనీయచరితు లగు శ్రీరాజా ఇనుగంటి వేంకటకృష్ణ రాయబహద్దరుగారి జీవితచరిత్రమగుట దీనియం దాయుత్త ముఁ డొక్కఁడే ముఖ్యముగా నభివర్ణింపఁబడియెను. పఠించి చూడ శ్రీవారిగుణగణములు బాల్యప్రభృతి గణనీయము లగుట సుస్పష్టము. అవగుణ మొకటియు నుల్లేఖింపఁబడ కుంట యజ్ఞుల కతిశయోక్తిగఁ దోఁచవచ్చునేమోగాని మహా పురుషచారిత్రవిజ్ఞుల కది స్వభావోక్తిగనే తోఁచును. ఒక వేళ నేదేని గొండొకలోపమే యుండినను 'ఏకోహి దోషో గుణసన్నిపాతే నిమజ్జతీందోః కిరణేష్వివాంక' అనునట్లది యీమహితుని సుగుణసహస్రమున నంతర్హితమయి తీఱుట స్వతస్సిద్ధము. మహాధీరుఁడును, దీనబాంధవుఁడును, నుదార మూర్తిశేఖరుఁడు నగు నీరాజసింహుని సుగుణసంపత్తి యీ కృతియం దన్నిఘట్టముల విస్తరింపఁబడియుంటచే నేనిందు దాని నెత్తిచూపుట స్వారస్యభంజక మని యుపేక్షించు చున్నాఁడ. పలువుర నుద్ధరింప సమర్థుఁ డగునిట్టిపుణ్యాత్ముఁడు పదికాలములపాటు వర్ధిలుట సర్వసజ్జనాపేక్షిత మయ్యును

యువు రెల్లరు సుకృతులే యగుచుందురనికాని నిర్ధారింపవు. ఈవాక్యార్థవిచార మెట్లున్నను మఱి యింకేది యెట్లున్నను ననితరానేకసుగుణోపేతులు, నత్యంతసుకృతులు నగుశ్రీ రాజాగా రింతపిన్నవయసున దివంగతులగుట సమకాలవర్తుల మగుమనకు మిక్కిలి శోచనీయ మనక తప్పదు. పరిచితాపరిచితు లగు నానాప్రాంతీయులు, నానాజాతిమతాచారపరులు, బంధుమిత్రాప్తులు, సామాన్యులు, మహామహులు, మహోద్యోగులు, పండితులు, కవులు మున్నగు వారు శ్రీవారి హఠాద్వియోగమున కనుతపించుచుఁ బ్రకటించిన యిందలి గద్యపద్యరచన లీయంశమునకుఁ బ్రత్యక్షసాక్ష్యము.

ఇఁక నీకృతివిశ్రుతికి ననితరప్రథితము, నసాధారణము నగు గొప్పవిశేష మింకొకటి గలదు. దాని నుపశ్లోకింపక నాతొలిపలుకు ముగించుట యనుచితము. అది యీకృతి కొక యపూర్వవైలక్షణ్యముం గలిగించుచున్నది. కాని పాఠకులకది యత్యంతవిషాదజనకము, హృదయవిదారకము ననక తప్పదు. అది యకృత్రిమము, ప్రకృతిసిద్ధము, అవ్యాజావ్యక్తాక్షరకలితము,అనుభూతాశేషవిశేషసన్నివేశసంబద్ధము. ఇట్లగుట నయ్యాలాపస్పర్శ మొకింత గోచరమగునేని భూమి భేదిల్లకపోదు ; పాషాణము ద్రవించకపోదు ; వజ్రము వ్రక్కలు గాకపోదు. ఇట్టిచో నిఁకఁ బిఱికిగుండెలు పిండిపిండి గాకుండు టెట్లు? తనతోడిగిజిగాడు ముహూర్తము గానరాకున్న నెలుంగు రాల్పడఁ బెంటిపులుఁగు గిలగిలలాడుఁగదా!

లోకసాధారణ స్త్రీవిలాపసందర్భములందె యిట్లుండ నిఁకఁ బతివ్రతాశిరోమణియు, నబలయు, నసూర్యంపశ్యయునగు శ్రీసరస్వతీ సతీవిలాపము కర్ణతాడితమై విదీర్ణేంద్రియులు గానిప్రాణు లెందును నుండఁబోరన సందియమేమి?

నిత్యప్రార్థనారూపమున నిందుఁ గానవచ్చుగ్రంథభాగమంతయుఁ దద్విలాపకలాపము. ఇం దీయనుగంటెరతి కొన్ని యెడల విశ్వమును మఱచియుఁ, గొన్ని యెడలఁ దన్నుఁ దా మఱచియు, మఱికొన్ని యెడల సర్వమును మఱచియు హృదయేశ్వరతన్మయతం గాంచుట గోచరించు. అసామాన్యానేకగుణవిభ్రాజితులై, సర్వస్వమూర్తులై, యప్రాప్తచత్వారింశదబ్దమాత్రులగు శ్రీవేంకటకృష్ణారావుబహాదరుగారి వక్షస్తల్పదూరీకృతయగు నాయల్పభాగ్యదీనాలాపములెంత కరుణరసవిలసితములై యుండునో యభిజ్ఞు లూహింపఁదగునేగాని నా కనువదింప నోరాడదు. నిజశోకము నీకృతిముఖమున వెలువరించి శ్రీసుబ్బారాయఁడుగారు కొంత శాంతిం గనుట నుపలక్షించియె కాఁబోలు నీయమయుఁ దన శోకము నేతన్ముఖమున వెలువరించినది! దయామయుఁడగు సర్వేశ్వరుఁడు ప్రార్థిత మనశ్శాంతి నీయమ కనుగ్రహించుఁగాక! తత్ప్రాణేశ్వరులగు శ్రీవారి కక్షయపుణ్యలోకవిహారముతో సుస్థిరాత్మశాంతిం బ్రసాదించుఁగాక! శ్రీవారి సంతానము ననంతతంతుసంతతముగ నాచంద్రార్కము వర్ధిలఁజేయుఁగాక! మూఁడుగాళ్ళముద్దలగు శ్రీవారితలిదండ్రులకు ముక్తిమార్గ ముద్బోధించి సమాహితచిత్తులం జేయుఁ

రసాస్వాదనము

శేషాద్రిరమణకవులు, శతావధానులు.

క. ఇనుగంటికృష్ణభూవిభు
జననమ్ము విమానయానచాతుర్యంబున్
మనికితము నూత్నకృతిగాఁ
దెనుఁగున రచియించె సఖుఁడు తీయనినుడులన్. 1

మ. రసవంతం బగు శైలిఁ గృష్ణవిభుశూ
రత్వంబు సాహిత్యమున్
రసికత్వంబుఁ బ్రశంసఁజేయుచుఁ గృతిన్
వ్రాయించె రత్నాంబ రా
జ్ఞి సమంచన్మతి రామసుబ్బకవిచే
స్విన్నాశ్రుధారాప్లుతుల్
బొసగన్ దాన సతీవిలాపకథనం
బున్ జూచి నేఁ గుందితిన్. 2

సీ. ఖ్యాతిమీరఁగ నినుగంటివంశాంభోధి
జైవాతృకుం డన జననమొంది
సురభి లక్ష్మారాయనరపాలపుత్రికా
మణి సరస్వతిని బ్రేమను వరించి

గీ. నిట్టియుత్తమసాధ్వి కహీనభర్తృ
చరణకంజాతసేవనాసక్తహృదయ
కీసరస్వతీరాజ్ఞికి నేల యిట్టి
పతివియోగంబుఁ గూర్చెనో పద్మభవుఁడు. 5

చ. అనితరభర్తృదుఃఖకలితాశయ యైనసరస్వతీమహా
జనని విచారభారమున సారె కొనర్చువిషాదగీతికల్
వినినకొలంది కన్నుగవ వెల్లువలౌ నిబిడాశ్రువుల్; దయా
ఖని యగునేని యావిధికిఁ గల్గదె జాలి రవంతయేనియున్.

మ. ఇది కర్మానుభవం బటంచు మది నూ
హించెన్ దదర్ధాంగి, దు
ర్విధికృత్యం బని యెంచెనేని కవితా
విఖ్యాతశాపోక్తిచేఁ
దుదిముట్టింపదె నల్వనేని కవితా
స్తోకప్రభావంబుచే
బ్రదికింపన్ వెనుదీయునే పతిని వి
ద్వల్లోకగేయంబుగన్. 7

మ. రసవత్సద్యవిషాదగానమున వీరగ్రామణిన్ గృష్ణభూ
పసునాశీరు నమోఘజీవితుని నల్వన్ నేర్చినావమ్మ భ
వ్యసమంచత్కవితాప్రపంచమున నీప్రాణేశ్వరుం డాధరా
శశితారార్కమునిల్వఁగాఁగలఁడు శశ్వత్కీర్తితో మాతరో.

ఆప్తవాక్యము

ఉ. శ్రీరమణీమనోహర! సమృద్ధభవత్కృపఁ గైత సెప్పఁగా
నేరుపు గల్గె నించుక; మనీషులు, భూవరు, లార్యసత్తముల్
వారక ప్రోత్సహింతురు శుభస్థితి దీవన లిచ్చి; యందుచే
నూరక వ్రాయుచుందుఁ గల మోపినరీతిగ నెల్లవేళలన్.

ఉ. పోతనభాస్కరాదికవిముఖ్యులువోలెఁ గవిత్వ మల్లఁగా
నాతరమౌనె? యిట్లని మనమ్మునఁ బెద్దిగులొంది మానఁగాఁ
జేతము సమ్మతించునె? విచిత్రముగాదొకొ దైవసృష్టి? యె
ట్లే తగురీతి నుండునని యెంచి రచింపఁగ సాహసించితిన్.

ఉ. ఎట్టులొ నాపురాకృత మహీనఫలంబున మాటచేత నె
నెట్టనఁ గాంచినాఁడఁ దగుస్నేహము సత్పురుషాళితోడ, నె
ప్పట్టుననింక వారలను బాయక కొల్తుఁ, దలంప నొండు; నా
కిట్టులె శాంతిసౌఖ్యముల నేగినఁ జాలును జీవితంబిలన్.

సీ. కవిరాజబుధగురుస్తవనీయకీర్తివై
భవశాలి కవిసార్వభౌముకరుణ
శతలేఖినీపద్యసంధానదక్షులౌ
తిరుపతి వేంకటేశ్వరులకరుణ

ఉ. ముప్పదియాఱు గ్రంథములు మోద మెలర్పఁగ వ్రాసినాఁడ నే
రొప్పినరీతి సత్కవులహో తగు ప్రీతిఁ బ్రమోదపత్రముల్
చొప్పడఁ జేసి రెంతయు విశుద్ధమనమ్మున, భక్తిభావముల్
తప్పక చూపుచుందు సతతంబును వారికి వారివారికిన్. 8

మ. కలకాలమ్ము వ్యయప్రయాసములకుం గాసంతలోపింప కే
కలలం దైనఁ గవిత్వతత్త్వవిలసద్గ్రంథంబు లేపారఁగా
లలిఁ జేయందలపెట్టినాఁడఁ బుడమిన్ లక్ష్యంబు సూత్రించి శ్రీ
లలనారత్నము ప్రోత్సహింప సఖులాహ్లాదంబునం జూడఁగన్

ఉ. వైదికమార్గవృత్తియనఁ బ్రాణము నాకుఁ బఠింప లేదొగిన్
వేద మొకింత, తెల్గునఁ గవిత్వ మెటో లభియించెఁ బొట్టకై
మేదిని నాంగ్లవిద్యయును మేలగు ‘పాళియు’ సంస్కృతంబునం
దాదృతిఁ జేసికొంతయును సభ్యసనం బొనరించి పెంచితిన్.

ఉ. ఇంతకు నాంగ్లభాషకయి యెక్కుడుకాలము పుచ్చినాఁడ నే
నంతటఁ బట్టభద్రపతి నైతిఁ గవిత్వము నీడవోలె న
న్నెంతయు వీడకుండె; నటు లేనును దానిని బెంచినాఁడ; జ
న్మాంతర దోషముల్ దొలఁగునంచు భజింతు నిటుల్ సరస్వతిన్.

ఉ. ఆవల నూజివీడుపురమందునఁ బావనధర్మశీలుఁడౌ
శ్రీవిజయాప్పరాణ్మణివిశిష్టకృపన్ గురుతన్ వహించుటన్
శ్రీవిభవంబుఁ గాంచితిని జేకుఱె మైత్రియుఁ గూడ; నంతటన్
దైవదయావివృద్ధి నరనాథునిఁ గొల్చితి లక్ష్మరాణ్మణిన్.

గీ. క్రమముగా విశ్వవిద్యాధికారు లెల్లఁ
బాఠ్యపుస్తకములుగ మాప్రబంధములను
నిర్ణయించి ప్రోత్సాహమ్ము నించుకతన
వృద్ధియగుచుండె నాసంఘ మెంతయేని. 18

ఉ. ఆపయిఁ గొంత ధైర్యముదయంబయినంతట నేను వెంటనే
స్థాపనచేసితిం గవనసంఘ మొకండు విధేయశిష్యులున్
శ్రీపతులున్ సుహృద్వరులుఁ జేకొని దానిని వృద్ధిసేయ భూ
మీపతి కృష్ణరాణ్మణి తమిన్గొని మెచ్చికొన న్బ్రియమ్మునన్.

ఉ. మెచ్చుటెకాక న న్బిలిచి మేదురభక్తిని గారవించి వి
ద్వచ్చయగేయ! నీకృతులపారముదమ్మునఁజూడఁగంటి ని
న్మెచ్చిరి పెద్దపెద్ద లవనిన్ యశమెంతయొగాంచినాఁడవో
సచ్చరితాగ్రగణ్య! యని సన్నుతిఁజేసె ననేకరీతులన్.

గీ. గారవంబునఁ బ్రతిశుక్రవారమందు
నన్నుఁ బిలిపించి సద్గాథ లెన్నియేని
విన్పు మని కోరుచుండె సంప్రీతితోడ
నటులె వినిపించుచుంటి నాహ్లాద మొదవ. 21

ఉ. వేఱొకనాఁడు న న్బిలిచి ప్రేమదలిర్పఁగ మాటలాడి దై
వారినభక్తితోడ గురువర్య! కవిత్వపటుత్వతత్వమున్
వారక చెప్పుమం చనఁగ బాష్పసమంచితలోచనుండనై
యూరకయుంటిఁ గొంతతడ వోపికఁబట్టుచు సమ్ముఖమ్మునన్.

ఉ. ఇంతకుమించుభాగ్య మొకఁడేనియు లేదనినిశ్చయించి యా
త్మాంతముదమ్ముతోడ దినమంతయు యోజనసేసినాఁడ సి
ద్ధాంత మొసర్చుకొంటి గుణధాముఁడుకృష్ణునకు న్గురుండుగా
నెంతటివారి కబ్బునని యెంతయు హర్షపయోధి మున్గితిన్. 28

శా. కానీ దైవ మసూయచేత సిటులా కార్యంబు సాగించుభా
గ్యానందమ్ము నొసంగఁడాయెనని హాహాకారముల్ సేసి భూ
జానిన్మ్రింగినచండమృత్యువునకై స్వాంతమ్మునంగుందుచున్
నానారీతుల దుఃఖమొందితిని కృష్ణారాయనిం బాయుటన్.

ఉ. ఆవలఁ గొన్నినాళ్లకు దయామతి శ్రీమతి శ్రీసరస్వతీ
దేవి యనుగ్రహమ్మున మదిన్గలచింత యొకింతపోయె న
న్నావరమానినీమణియు సాదరమేదురచిత్తవృత్తితోఁ
బావనధర్మబుద్ధిగొని భక్తిఁదలిర్పఁగఁ జూచు నెంతయున్.

ఉ. వారియుదారభావములు వారిమహాగుణశీలవృత్తముల్
వారివిశిష్టధర్మములు వారివివేకవికాసకాంతియున్
వారిపరోపకారగుణభావవిశాలనయప్రబోధముల్
వారిదృఢవ్రతంబులును వారికె చెల్లునుబో ధరాస్థలిన్.

గీ. ఆసరస్వతీవిగ్రహమా యని జను
లెల్లఁ బొగడు తెల్విని గాంచె నిలఁ గవిత్వ
తత్వలక్షణమార్గ మంతయు నెఱింగె
నదియ వృద్ధిసేయవలయునంచుఁ దలఁచె. 32

గీ. అకట ! కృష్ణభూజానిఁ బాయంగఁజేసి
నట్టివిధికృతములకు నేమందు ? నాశ
లన్నియును దీఱె నాకల మాడదాయె ;
నైన ధృతిఁగొంటి నాధన్యు నభినుతింప. 38

గీ. వ్రాయఁబూనితి నిట్లు కావ్యం బొకండు
కృష్ణభూజానిచరితం బదెల్లఁ గొంత
వఱకు గద్యపద్యంబులసరణిఁ జూపి
శ్రీసరస్వతీకరుణావిశేష ముంట. 39

చ. హరికి సమర్పణంబుగమహాకృతు లెన్నియొవ్రాసి సత్కవుల్
ధరఁ దరియింపలేదె? వసుధాపతి శ్రీహరితుల్యుఁ డంచు నే
నరసి తరింతునం చిటు మహత్తరజీవితగాథ వ్రాయఁగా
దొరకొని కృష్ణభూపతికె తోరపుభక్తిని నీయనెంచితిన్.

ఉ. అక్షరకోటి వ్రాయ మనమందున నెంచితి భక్తిపెంపునన్
దీక్షవహించి సత్కృతులఁ దీర్చి రచించెడువేళలందుఁ బ్ర
త్యక్షరమున్ గణింపఁదగుఁ దత్పరమార్థము రామకోటిగా
నక్షయసౌఖ్యసంపదల నందఁగఁజేయుత శాశ్వతంబుగన్.

ఉ. ఇంతకు మించి చేయఁగలదేదియుఁ గన్పడఁబోదు నాకు ర
వ్వంతయు జీవనార్థము ధరాధిపుఁడింతయొసంగె భార్యయున్
సంతతియుండె నోపికయుఁ జక్కఁగనుండెఁ గవిత్వముండె నా
కింతటిభాగ్యముంటఁ గృతు లేర్పడ వ్రాసి తరింపనెంచితిన్.

ఇట్లు,
కావ్యకర్త.

ఉ. బాపురె మాతృభాషయన భారము దోఁచిన కాలమందుఁ గొ
ల్లాపుర రాజ్యలక్ష్మిని విలాసముతోడఁ దెలుంగుకైతకుం
బ్రాపొనరించినాఁడవు సెబాసన నీపయి నాంధ్రలోకసం
తాపముఁ బాపి స్నేహలత ధారుణిఁ జల్లఁగ నల్లు నెల్లెడన్.

గుంటూరు. } కాశీ కృష్ణాచార్యులు.
(అవధానిశిరోమణి)

అస్మన్మిత్రవర్యులగు బ్రహ్మశ్రీ వాజపేయయాజుల రామసుబ్బరాయకవివర్యుల సమ్ముఖమునకు:—

ఆర్యా !

శ్రీజటప్రోలుసంస్థానాధీశ్వరుల యాస్థానమునుండి తమచే "స్నేహలతాకవితాసంఘము" 1929 సంవత్సరమున సుప్రతిష్ఠితమైనది మొదలుకొని తాము గావించుచున్న యాంధ్రభాషాసేవను నే నిదివఱకే గుర్తించియున్నవాఁడను. మీకవిత్వమునందు ధారాశుద్ధియుఁ, బాకశుద్ధియుఁ గన్పట్టుచున్నందునఁ దమయనర్గళవాగ్ధారను గడుపారఁ గ్రోలి యానందించుచున్నాఁడను. జటప్రోలుసంస్థానము మాతృభాషాపోషణమున నిదివఱకె కడుంగడు ప్రఖ్యాతిఁగాంచిన దనుట సుప్రసిద్ధచారిత్రకవిషయము. ఏతత్సంస్థానాధీశ్వరులు భాషాభిమానులనుటకుఁ జంద్రికాపరిణయము నే చాలినంత నిదర్శనముగఁ జూపవచ్చును. పరంపరాగత మగు సంప్రదాయమును, భాషాభిమానమును బండితజనా

A few facts & Personal impressions

FAVOURED BY

THE YUVARAJAH SAHEB OF PITHAPUR.

On my request the Yuva Rajah Saheb of Pithapur, the brother-in-law and a personal friend of the late Rajah, J. V. Kristna Rao Bahadur, supplied me the following facts, his personal impressions which are invaluable in writing a biography. I am much indebted to the Yuva Rajah Saheb of Pithapur for his gracious favour.

V. R.

*

I. He is an exceedingly kind friend.

(*a*) Would do all that was possible for friends.

(*b*) Used to spend quite a lot for the sake of friends.

(*c*) Sincerely sympathised with friends in difficulty and helped them.

(*d*) Very rarely he said 'no' to a request from a friend.

II. Was very sociable and was quite popular among the people he mixed with.

శ్రీమత్పరదేవతాయై నమః

శ్రీ రాజా వేంకటకృష్ణారావు బహద్దరువారి జీవితము

1. సారసంగ్రహము

జననము

శ్రీ రాజా వేంకటకృష్ణారావుబహద్దరువారు వికారినామ సంవత్సర వైశాఖబహుళషష్ఠీ కుజవాసరమున (30-5-1899) జననమొందిరి. శ్రీరాజకుమారశుభోదయమున శ్రీమ దినుగంటి వంశపయఃపారావారము దిగంతవిశ్రాంత కీర్తితరంగితమై విశేషపావనతం బడసినది. శ్రీరాజావారి జన్మస్థానము శ్రీవేంకటగిరిసంస్థానము. శ్రీతిరుపాచూరు జమీందారులును, భక్తిజ్ఞాన సంపన్నులును, ధర్మనిష్ఠాపవిత్రారాధన తత్పరులును, నయజ్ఞులును నగు శ్రీరాజా వేంకటరాయనిం బహద్దరుగారు వీరి జనకులు. శ్రీశ్రీవేంకటగిరి మహారాజా బహద్దరుగారి పుత్రికారత్నమగు శ్రీశ్రీ సౌభాగ్యవతి శ్రీరాజ్యలక్ష్మీదేవమ్మగారు వీరి జనని. చిన్నప్పటినుండియు మాతాపితృగురుదైవతములం దనన్య వినయవిధేయతలును, భక్తి

పూవు పుట్టినదితడవుగఁ బరిమళము నల్దెసల వ్యాపించినట్లు ధైర్య స్థైర్య శౌర్య గాంభీర్యాది గుణగణంబులు బాల్యమునుండియే శ్రీరాజావారి ముఖపద్మమునఁ దాండవ మాడుచుండె. దైవానుగృహీతములగు నిట్టి సుగుణరత్నములు సద్గురుబోధశాణోల్లిఖితములై యచిరకాలమున నసమాన ప్రభావిభాసమాన దిగంతములై యలోకసామాన్యము లగుటలో నాశ్చర్యలేశముం గాన్పింపదు.

విద్యాభ్యాసము

శ్రీవారు బాల్యమునందె పఠన, లేఖనాభ్యాసములతోపాటు క్షత్రియవర్ణమున కుచితమగు విద్యాకళల నన్నిటి నభ్యసించి, సాధించి షోడశాబ్దములు నిండువఱకు షోడశకళాపరిపూర్ణులైరి. విశేషశేముషీ సమార్జనాసక్తిచే శ్రీబొబ్బిలి సంస్థానోన్నత పాఠశాలయందున్నతవిద్య నభ్యసించిరి. చిన్ననాఁటినుండియు గణితవిద్య యందు వీరిని మీఱఁగల సహపాఠులేతరగతియందును లేరని ఘనత గడించిరి. ఏకసంథాగ్రాహులనియుఁ గుశాగ్రబుద్ధులనియుఁ బదవాక్యప్రమాణవిదులనియు బహుతరముగఁ బ్రశంసింపఁబడుచు శ్రీవారమితప్రజ్ఞాధురంధరులై యొప్పుచుండెడివారు. పాఠశాలలో నడుగువెట్టినది మొదలు గురుబోధమునం దేకాగ్రచిత్తులై యుండెడివారన్న ప్రతీతి గలదు. తోడివిద్యార్థులయం దమితప్రేమమును, మిత్రుల యెడ నమిత విశ్వాసమును, గురువులయెడ నమిత భయ

లును, రాజలోకచూడామణులును, జగద్విఖ్యాతసంపన్ను లును, విద్యాప్రియులును నగు శ్రీరాజా సురభి వేంకటలక్ష్మా రావు బహద్దర్ నిజాం నవాజ్ వంత్ వారి ద్వితీయ పుత్రికా రత్న మగు శ్రీశ్రీ సరస్వతీ అమ్మయ్యగారిని 1917 సంవత్స రమున వివాహమాడిరి. శ్రీరాజా వేంకటలక్ష్మారావు బహ ద్దరువారికి శ్రీరాజా వేంకటకృష్ణారావుగారు భాగినేయులు. 'మేనమామపోలికలు, మేనత్తచాటికలు వేఱుగా' వన్నట్లు మేనమామగారివలె వీరును సర్వకళలయందును సమర్థులై లోకనుతి గాంచుట సముచితసంప్రదాయపరిప్రాప్తము.

ధ ర్మ ప త్ని

"Friendship, Society and Love
Are Divinely bestowed upon men"

స్నేహము, సత్సాంగత్యము, నిర్వ్యాజప్రేమ—యివి మానవులకు దైవప్రసాదితంబులైనను బురుషులు వీనియం దాత్మవంచితులుగాక లోకమున లోకాదృతితోఁ దమతమ జీవయాత్రను నడుపుకొనుటకు 'గృహలక్ష్మి' ప్రధానావ లంబము. శ్రీరాజావారి యుదారగుణమణిగణప్రకాశమును దన మందహాసచంద్రికలచే శతగుణితమొనర్చు పరమపతి వ్రతాశిరోమణి శ్రీవారిని జిన్ననాఁటనె వరించి,యర్ధాంగలక్ష్మి యగుట మహాభాగ్యము. శ్రీ సరస్వతీదేవమ్మగారు సాంగ విద్యావతులై తమ నామధేయమును సార్థకముచేసికొనిరి.



శ్రీ రాజాగారి జ్యేష్ఠపుత్రికారత్నము

కాక నిజధర్మపత్నియందుఁగూడ సప్తసంతానభాగ్యమును గాంచిరి. శ్రీరాజావారికి ముగ్గురు పుత్త్రులును, నలుగురు పుత్రికలును నుదయించిరి.

పుత్రరత్నములు

1. శ్రీరాజా మురళీకృష్ణారావుగారు.
2. శ్రీరాజా మదనగోపాలస్వామిగారు.
3. శ్రీరాజా పాండురంగలక్ష్మారావుగారు.

పుత్రికారత్నములు

1. శ్రీశ్రీ సౌభాగ్యవతి ఇందిరాదేవమ్మగారు.
2. శ్రీసామ్రాజ్యలక్ష్మమ్మగారు–
3. శ్రీవేంకటరత్నమాంబగారు.
4. శ్రీరాజరాజేశ్వరమ్మగారు.

శ్రీవారి పుత్రరత్నములలోఁ బ్రథమరత్న మగు శ్రీరాజా మురళీకృష్ణారావుగారు.

'రూపం తదోజస్వి తదేవ వీర్యం
తదేవ నైసర్గిక మున్నతత్వమ్
న కారణా త్స్వా ద్బిభిదే కుమారః
ప్రవర్తితో దీప ఇవ ప్రదీపాత్'

మొనగాండ్రవలె నిరంతర మభ్యాస మొనరించుచుండినవార
లగుటచే శ్రీవారి మసృణమాంసలోన్నతకాయము తత్సహజ
ధైర్యమునకు మఱింతవన్నె వెట్టెను. సింహగంభీరసుందరా
ననమునకు బుద్ధివికాస మపూర్వాలంకారమయ్యెను. నైతి
కాచారధర్మపరులై శరీరమును జక్కఁగఁ గాపాడుకొను
చుండెడివారు. శరీరబల మెంతబాగుగ నుండిన బుద్ధిబల
మును నంత కెక్కుడుగ నుండునని వ్యాయామశాస్త్రనిర్ణ
యము. శ్రీరాజాగా రీసూత్రమునకుఁ బ్రత్యక్షలక్ష్యమై
సర్వవైభవములతో సుఖముగఁ గాలముగడపుచుండెడివారు.
గుఱ్ఱపుసవారిలోను, పోలో మొదలగు వినోదక్రీడలలోను,
దుష్టమృగసంహారక్రీడలలోను శ్రీరాజావారిని మించిన
వేఱొకధీరుఁడు లేఁడని చెప్పవచ్చును. క్రూరమృగసంహా
రము కేవలము ప్రజాసంరక్షణార్థమై శ్రీవా రంగీకరించి
రనుట కనేక నిదర్శనంబులు గలవు. కేవల మొకవినోద
క్రీడగ దీనియందు లోలత గలవారు కారు. మృగయ సప్త
వ్యసనములలో నొకటిగ నవగణింపఁబడినను స్వప్రజా
క్షేమమున కిట్టిమహాకార్యము పవిత్రతమమని శ్రీవారికి దృఢ
విశ్వాసముండుటచే నద్దానికై బయలుదేఱునప్పుడుగూడఁ
గొన్ని ధర్మనియమములను బాటించుచుండెడివారు. వేఁట
యం దెంతయుత్సాహ ముండినను, నొకప్పుడు రాత్రుల
యందు మూఁడుగంటలసమయమున బయలుదేఱవలసి
వచ్చినను, నంతకుఁ బూర్వము లేచి కాల్యకృత్యములను
దీర్చికొని, స్నాన మాచరించి, దేవతాపూజ చేసికొనిన

సీ. ఆలములోన వీరుఁడు జయంబును గాంచెడుకీతి మూఁడుశా
స్త్రాలములన్ని మేషమునఁద్రుంచి యశంబునుగాంచి శౌర్యము
న్మేలుగఁజూపి వీర్యమున మించితివీ వతివీరమూ ర్తి వె
వ్వేళల నీకు శ్రేయమగు విశ్రుతకీ ర్తికి ధర్మవ ర్తికిన్.

దైవభ క్తి

శ్రీరాజాబహద్దరువారికి 'నిత్యవ్రతనిష్ఠ,' 'నిర్వ్యాజవాగ్వృత్తి,' 'దీనోద్ధారసుబుద్ధి,' 'పరహితోద్దేశైకసంసిద్ధి,' 'దానారంభసమృద్ధి' 'ప్రేమ' ప్రభృతిగుణంబులెట్లు సహజభూషణంబు లయ్యెనో యట్లే భక్తిగుణముగూడఁ బ్రధానభూషణ మయ్యె. శ్రీవారు వేంకటేశ్వర భక్తులై నిత్యము తత్పూజాతత్పరత నానందించువారు. విద్వద్గణ్యమగు వంశమ్మున నవతరించి, బాల్యంబునన సకలవిద్యల నభ్యసించి, వైభవజిత పురందరులై, విజ్ఞానఖను లగుట శ్రీవారిజన్మాంతరసుకృతపరిపాకము. శ్రీవా రాగర్భశ్రీమంతులయ్యు నిగర్వచూడామణులు. బీదలయందు దయాదాక్షిణ్యబుద్ధి, మిత్రులయెడ నాదరబుద్ధి, భృత్యకోటియెడఁ బ్రేమబుద్ధి జన్మసిద్ధమగు దైవభ క్తితో ననుబద్ధములై శ్రీవారిని 'రాజలోకచూడామణి' 'మానవలోకచింతామణి' యని ప్రసిద్ధపఱచె.

శీలసంప త్తి శ్రీరాజావారి రాజగృహమునఁ దాండవమాడుచుండును. దయాసత్యశౌచంబుల కాలవాలమగు నారీరత్నము నర్ధాంగలక్ష్మిగఁ బడసిన శ్రీరాజావారి నిశ్చలభ క్తి

2. విద్యావికాసము.

శ్రేయఃప్రాపకమై, సకలసంశయచ్ఛేదకమై, యతీంద్రియవిజ్ఞానదాయకమై, పరమేశ్వర తేజస్సందర్శనసాధకమై, ధైర్యోత్సాహానందోత్తేజకమై మానవుని మానవత్వమునుండి తదున్నతస్థాన మగు దేవత్వపదవికిఁ జేర్చునదియే విద్య యనఁబడును. అట్టి విద్యాభివృద్ధికై శ్రీకృష్ణారాయ బహద్దరువారు సంతతము ప్రయత్నముచేయుచు నమూల్యములగు నవకాశములను సమకూర్చుచుండెడివారు. తాము కేవలము హూణభాషామహోదధి మథించి తత్సారామృతమును గ్రోలుటయేగాక యాంధ్రభాషాయోషను నవ్యకావ్యమణిమయాలంకారశోభితాంగిగ నొనర్ప విద్వత్కవిరాజశిఖామణులను బ్రోత్సహించుచుండెడివారు. శ్రీవారు శ్రీమదాంధ్ర మహాభారత రామాయణాది బహుప్రబంధ నిరంతరపఠన కథాశ్రవణాసక్తులై యుండుచుండుటయే శ్రీవారి యాంధ్రవాణీప్రీతికిఁ బ్రబలనిదర్శనము. పేదలగు విద్యార్థులు దమ్ము నర్థింపవచ్చిన వారల నాదరించి తదున్నతికై నియమముగ ద్రవ్య మొసంగి రక్షించు శ్రీవారి విద్యాభిమానము వేనోళ్ళఁ గొనియాడఁదగినది. తమ్ము దర్శింపవచ్చినపండితుల సంభావించి యలవారి సాహిత్యకళావిశేషములకు నుప్పొంగుచు దేశమున నవ్యసాహిత్యవైభవంబునకుఁ జేయూఁత నొసంగుచుండెడివారు. మఱియు

లిన్యము చూపుమాయ దను పెద్దలవాక్యమును బాటించి సకలదివ్యక్షేత్రసందర్శన మొనరించి, యాయా పుణ్యప్రదేశములయందుఁ బ్రవహించు పావననదీప్రవాహంబులఁ గ్రుంకులిడి, సకలదానధర్మంబులు గావించి, పుణ్యాత్ముల దర్శించి తదాశీరభినందనము లందికొని పరమేశ్వరసందర్శనమహాభాగ్యంబునఁ గృతార్థులై జీవితమును సార్థక మొనరించుకొనిన శ్రీవారు సాధుజనగణాగ్రగణ్యులై సుకృతాత్ము లగుట భాగ్యాతిరేకనిదర్శనము. అదృష్టబలమున సంప్రాప్తమైన విద్యావిశేషము శ్రీవారికి నాధ్యాత్మికవిద్యాసంపదను, నిశ్చలపరమేశ్వరభక్తిప్రపత్తిని, నాత్మగౌరవకళా కౌశలమును, నియమపూర్వక నిష్ఠాగరిష్ఠతను, బవిత్రతను సమకూర్చి ధన్యులఁ గావించెనని చెప్పుటలో నతిశయోక్తి యించుకంతయు లేదు. విద్యావికాసవిశిష్ట మగు శ్రీవారి జీవితము కడుంగడు శ్లాఘ్యము.

జనాపవాదాపయశోనివారణార్థమై దుర్భరగర్భభార ఖిన్నయు, నిరపరాధయుఁ, బరమసాధ్వీమతల్లియు నగు జానకీదేవిని గాఁ ఱడవుల డించివేయింప నిశ్చయించుకొనియు 'అద్యావసితం జీవితప్రయోజనం రామస్య, జీర్ణారణ్యాం జగ' త్తనుచుఁ, బొంగిపొరలు బాష్పపూరమును నిరోధింప నేరని శ్రీరాముఁ డెంతటికరుణామూర్తి కావచ్చును!

అన్నయాజ్ఞను శిరసావహించి విమలజాహ్నవీతట ప్రాంతకాంతారభూములందు వదినె నొంటి డిగ విడుచుచు

"జననీ! నీవు మహాపతివ్రతవు నీసౌశీల్య మిల్లాండ్రి కెల్లను మేల్బంతిరఘూద్వహాంఘ్రియుగళీలగ్నాత్మవై యుండుమా యని నేనెవ్వఁడ విన్నవింపఁ బతిఁ బాయంజేసి నిన్నొంటి డించినమూఢాత్ముఁడ ... ..."

అని కనుగ్రింతల ముంతలఁబోసిన ట్లశ్రుధారలఁ గార్చుచు గోలుగోలున నేడ్చుచు, వీడిచనఁ దనకాళ్ళు రాక బిట్టుగొట్టుకొనుచుఁ గటకటంబడు సౌమిత్రి కరుణావివరణమున నన్నకుం దీసిపోవునా?

రామవియోగసంజనితదుఃఖసాగరనిమగ్నయై జానకి నిస్సహాయతఁ జేతులు పైకెత్తి 'హా రామా' యను నక్షరద్వయమునే జపించుచు ముక్తకంఠముగ రోదనముసేయుచుండ 'నమ్మా! భయపడకుము. నన్ను మిథిలాధినాథుగ నీచిత్తంబులో నెంచుము. నాయాశ్రమాంతికభూములు నీ

అను నార్యోక్తికిఁ బ్రిధానలక్ష్య మగుచున్నది. శ్రీవారు తమ మిత్రవర్గమునకేకాక సకలలోకమునకుఁ గూడ సన్మిత్రులు. ఎవ్వరికి నపకృతిఁజేసి యెఱుంగరు. శ్రీవారు ప్రజాక్షేమమే నిజక్షేమముగ నెంచి తన్మహాభాగ్య సంపత్తికి సన్మిత్రసంపాదనమే మూలసూత్రమని యెఱుంగుటయే కాక తదాచరణమందు విజయమొందిరి. ఒక్కొక్కతఱిఁ దన్నర్థింపవచ్చిన మిత్రవర్గమునకు మున్నభయప్రదానమొసంగి సుధామయోక్తులఁ దదాప్తజనహృదయసంతాప మడంచి, యర్థిజనులపట్ల 'లేద'ను నక్షరద్వయమును లేదనిపించి నిర్వ్యాజవదాన్యతామూర్తి యని స్థిర యశంబును గాంచిన ధన్యుఁడు మా కృష్ణరాయరాజశేఖరుఁడొక్కఁడేయని లోకము గానముచేయుచున్నది. శ్రీవారు న్యూనతాధిక్యములను బాటింపక సమత వర్తించుచు

ఆ. "సుఖము విడిచియైన సురుచిర భోగంబు
విడిచియైన ధనము విడిచియైన
మేను విడిచియైన మిత్రునికార్యంబు
చక్కఁజేయు టదియ సఖ్యవిధము."

అను మహాకవి వాక్యమును వేదవాక్యముగఁ జేసిన ధన్యులు. "పరమగతి మిత్రుఁ డొక్కండె ధరణియందు" అను శ్రీరామవాక్యము నాదర్శముగఁ గొని తమ జీవితము గూడ ధర్మవీరులగు పురాతనరాజన్యచూడామణులజీవితము

4. ధైర్యము

"ఉత్సాహ స్సాహసం ధైర్యం బుద్ధిశ్శక్తిః పరాక్రమః
షడేతే యత్ర తిష్ఠంతి తత్ర దేవోఽపి తిష్ఠతి"

అమోఘమును భగవద్దత్తమును నగు నాత్మవిశ్వాసమే ధైర్య మనఁబడును. ఇది యుత్సాహప్రభుమంత్రశక్తులకు నిదానమైనది. ధైర్యవంతు లుత్సాహమును గోల్పోవఁ జాలరు. ఉత్సాహమువలన మంత్రశక్తి జనించును. ఆలోచనాశక్తిచేతనే ప్రభుశక్తియుఁ, గార్యాచరణకుశలతయుఁ గలుగుచుండును. ధైర్యవంతునకే సదావిజయము. తనగమ్యస్థానము చేరువఱకును ధైర్యవంతుఁడు పనిచేయుచునే యుండును. సత్యనిష్ఠ, క్షమాసంపత్తి, పవిత్రత ధైర్యవంతుని సహజగుణములు. ఈయనంతవిశ్వారామమున విహరించునప్పుడు నడుమ వచ్చెడు నపారవిపత్పరంపరాఘాతములకు జంకక తను వర్పించుచుఁ బ్రాక్కృతకర్మజంఝూవాతసముద్ధూతసంకల్పవికల్పదురంతమహావృక్షములు పైఁబడినను గాలూఁది నిలిచి తననిస్సహాయత కొక్కొక్కతఱి ఘోరవిషాదసాగరగర్భమునఁ బడి స్రుక్కి వేసారి కన్నుల నీరు గ్రమ్మ నాకసమువంకఁ జూచుచు హా, యని వేడినిట్టూర్పు గాడ్పులహృదయవేదనాబడబానలము ప్రజ్వలింపఁజేయుచుఁ జేయునది లేక తనసర్వస్వమును భగవంతున కర్పించి

"తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహ" మను భగవద్దత్తాభయప్రదానమును సంస్మరించుచు దిగులు విడిచి తెలివొంది కార్యరంగమున కుఱుకువాఁడు ధైర్యవం తుఁడుగాక మఱెవ్వఁడు ? కావున నే

'అనిర్వేదః పరం దైవ మనిర్వేదః పరం బలమ్'

అని పరమార్థప్రతిపాదక మైనతన రామాయణ మహాకావ్యమందు భగవంతుఁ డగువాల్మీకి వేమాఱు సందేశ మొసంగియున్నవాఁడు.

శ్లో. 'నిన్దన్తు నీతినిపుణా యదివా స్తువన్తు
లక్ష్మీ స్సమావిశతు గచ్ఛతువా యథేష్టమ్;
అద్యైవవా మరణ మస్తు యుగాన్తరే వా
న్యాయ్యా త్పథః ప్రవిచలన్తి పదం న ధీరాః.'

అని ధైర్యనిధి యగుభర్తృహరి వచించినట్లు ధైర్య సంపన్నుఁడెట్టి సంకటసమయమునను దనస్థానమునుండి యించుకంతయైనను జలింపఁడు. వాఁడు కేవలభౌతికసౌఖ్య సామ్రాజ్యమునకు లోనుగాక పరమేశ్వరతేజస్సందర్శనమే లక్ష్యముగఁ గొని ముందునకు సాగిపోవుచుండును. నడుమ నైహికసౌఖ్యలోలు రగు రాజనీతివిశారదులు నిందింతురు గాక, లేదా పొగడుదురుగాక యవ్వారిదూషణభూషణము లకుఁ బులకితాంగుఁడుగాక సత్యనిష్ఠయందు సుప్రతిష్ఠితుఁడై యుండు. సంపదలు వచ్చి తన్ను వరించిన వరించుఁ గాక;

లేదా, సౌఖ్యనిధాన మగు తనయావత్సంపదయుఁ దొలఁగి పోయినఁ బోవుఁగాక; యతఁడు తనక్షమాసంపదనే చిక్కఁ బట్టుకొనియుండును. ఒక్కొక్కవేళ నప్పుడ ప్రాణము లర్పింపవలసివచ్చినను లేక యుగయుగాంతరములవఱకు నిలువఁగలభాగ్య మబ్బినను దన విమలపవిత్రదృక్పథ మునుండి తొలంగఁజాలఁడు. వేయేల ! ధైర్యవంతునకే సర్వత్ర విజయము. ధైర్యవంతుఁడే లోకకల్యాణమునకుఁ దోరణము గట్ట సమర్థుఁడు. ధైర్యవంతుఁడే దీనుల నుద్ధరించి యీయనంతవిశ్వవికసనహేతుభూత మగు పవిత్రసందేశ మొసంగఁగల భాగ్యవంతుఁడు. అతఁడే చిరస్థాయి. దేవేం దుృఁడు రాలవానఁ గురిపించి గోగోపీగోపనివహంబునకు భీతి జనింపఁజేయఁ గరుణాసముద్రుఁ డగు శ్రీకృష్ణభగవానుఁడు తన కొనవ్రేల గోవర్ధనగిరి నెత్తి తదాశ్రితబృంద మునకు

శా. "బాలుం డీతఁడు కొండ దొడ్డది మహా
భారంబు సైరింపఁగాఁ
జాలండోయని దీనికిృంద నిలువన్
శంకింపఁగాఁ బోల దీ
శైలాంభోనిధిజంతుసంయుతధరా
చక్రంబు పైఁబడ్డ నా
కే లల్లాడదు బంధులార ! నిలుఁడీ
క్రిందం బ్రవేశింపరే."

అని యొసంగిన యభయప్రదానమును దలఁచిన నెవ్వాని మేను జలదరింపదు ?

శ్రీకృష్ణ కథామృతమును దనివిదీరఁ గ్రోలి తదుదార చారిత్రమునే సంతత మాదర్శముగ నుంచుకొని ప్రవర్తించు దీనజనకల్పకమగు మన శ్రీరాజా వేంకటకృష్ణారావు బహద్దరువారి పరమపావనజీవితము ధైర్యగుణభూషణభూషితము. శ్రీవారి ధైర్యము విమలచారిత్రమునకు నూతనవికాసమును ఘటించుచు సజ్జనగణ్యమై, యమోఘమై, యానందజనకమై యలరారుచున్నది. శ్రీవారి మిత్రసంతతి కప్పుడప్పుడు సంఘటించిన విపత్కష్టములు శ్రీవారి ధైర్యసందేశమువలననే దాఁటుటకు సుగమములైనవి. అశ్వారోహణమందున నేమి, గజారోహణమందుననేమి, తదితరయంత్రశకటారోహణమందున నేమి, పెక్కేల, విమానయానములయందున నేమి– అతినైపుణ్యమును, నతిసాహసమును, నతివేగమును, గలవారై నుతిఁగన్నవారు. అందులకు ముఖ్యహేతువు శ్రీవారి ధైర్యసంపదగాక మఱేమి కలదు? విద్వత్కవిలోకము శ్రీవారినిఁ గాంచినంతట “సముద్ర ఇవ గాంభీర్యే ధైర్యేణ హిమవానివ” యని గానముచేయును. శ్రీవారి ధైర్యసాహసములే క్రూరకర్ణివ్యాదోపదర్నవభీత చిత్తులగు దీనులకుఁ బెట్టనికోటయై ధైర్యలక్ష్మిం జేకూర్చి సుఖజీవన మొసఁగుచున్నవి. అనంతములగు ప్రకృతిపరీక్షల జయమొంది లోకస్తుతిపాత్రమై, పరమపవిత్రమై, కవిజనాహ్లాదకరమై,

యానందజనకమై, జగద్విఖ్యాతహేతువై, ప్రబంధసన్నిభమై సుస్థిరమైన శ్రీవారి ధైర్యలక్ష్మీదివ్యసౌధము మిన్నంటి యాచంద్రతారార్కమల రారుఁగాత!

"సకలసంపత్ప్రధాన కారణము ధైర్యము. అంతకు మిన్న మఱియొకటి లే" దనిలోకమునకు సందేశ మొసంగిన శ్రీవారి ధైర్యగుణభూషిత మగుచారిత్రము కావ్యరూపమై లోకమున కాదర్శ మగుచున్నది. కావునఁ బ్రతి మానవునకును సుఖకర మగు జీవయాత్ర నడపుకొనుటకు ధైర్యమే మూలకారణము.

5. సత్యదీక్ష

శ్లో. "ప్రారభ్యతే న ఖలు విఘ్నభయేన నీచైః
ప్రారభ్య విఘ్నవిహతా విరమన్తి మధ్యాః
విఘ్నై ర్ముహుర్ముహు రపి ప్రతిహన్యమానాః
ప్రారబ్ధ ముత్తమగుణా న పరిత్యజన్తి.


శా. ఆరంభింపరు నీచమానవులు విఘ్నాయాససంత్రస్తులై;
యారంభించి పరిత్యజింతు రురువిఘ్నాయత్తులై మధ్యముల్;
ధీరుల్ విఘ్ననిహన్యమానులగుచున్ ధృత్యున్నతోత్సాహులై
ప్రారబ్ధార్థము లుజ్జగింపరుసుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్."

సుభాషితప్రసిద్ధబోద్ధ భర్తృహరి గావించిన పైయుద్బోధము ననుసరించియు, నార్యజనహితధర్మప్రబోధము ననుసరించియు శ్రీరాజావారి కార్యదీక్ష మిక్కిలి సునిశితమైనది. చేపట్టిన కార్యము విడుచుట ధీరజనలక్షణము కాదనియుఁ దలపెట్టిన కృత్యము నెట్టిక్లిష్టసమయములందైన నోర్చి వెనుకంజవేయక సాధించుట మహాపురుషుల లక్షణ మనియు గ్రహించికాఁబోలు శ్రీరాజావారేకార్యముఁ జేయఁబూనినను దుదివఱకు మహాదీక్షతోఁ బనిచేసి దానిని సాధించుచుండెడివారు. దీనినిబట్టి శ్రీవారి ధైర్యసాహసమనోబలమెట్టిదో, ధర్మాసక్తి యెట్టిదో, కార్యశూరత యెట్టిదో, ధీరశీలసంపన్నత యెట్టిదో చెప్పకయ సుస్పష్టమగుచున్నది. "న నిశ్చితార్థా ద్విరమన్తి ధీరా" అనుసూత్రమునకు

శ్రీవారి జీవితచారిత్రము మేలితార్కాణమనుట కిసుమంతయు సంశయము లేదు. శ్రీవా రేకార్యము చేయఁబూనుకొన్నను ముందుగ ననేకవిధముల స్వాఽశంకాసమాధానములతో నాలోచించినపిదపఁగాని చేయనిశ్చయించుకొనువారు కారు. కార్యసాధనము కాదని హృదయసంకోచము కలిగిననాఁడు గాని, యట్టికార్యమువలనఁ దమకుఁగాని, లోకమునకుఁ గాని యెట్టిప్రయోజనము లేదని తెలిసినప్పుడుగాని యట్టి కార్యమునుండి బుద్ధిని వెంటనే మరల్చువిలక్షణస్వభావము గలవారు. ధర్మమని నమ్మి యొక సత్కార్యము నొక పర్యాయము చేయసంకల్పించినచో దానిని బ్రాణమునకుఁ బ్రాణ మొడ్డియైనను బరాక్రమవిక్రమంబున సాధించి సిద్ధ సంకల్పు లగుదురు. అంతియకాని నడుమ నడుమ సంభ వించు విఘ్నములకుఁగాని, కష్టనష్టములకుఁగాని, వ్యయ ప్రయాసములకుఁగాని కాసంతైనను జంకుస్వభావము కల వారు కారు. అధర్మకార్యములకుఁ గలనైనఁ గడంగక, నిరంతరధర్మకార్యనిర్వహణసందర్భముననే యుద్యమించు శ్రీవారిదీక్షయే సత్యదీక్షగాని తదితరములు మృషాదీక్ష లనిన నాక్షేపము గలదా? లోకమున సర్వసాధారణము గా మానవుల కెల్లరకును దీక్షాపేక్ష యనుగుణ మొకటి యుండును. దానిచేఁ దాము తలపెట్టినకార్యములు సాధించు కొనుచుందురు. కాని వారిదీక్ష ధర్మైకాశ్రితముగాక దంభాసూయాక్రోధదూషిత మగుటచే నది యొకవిధమగు పట్టుదల యనిపించుకొనునేగాని దీక్షగాఁజాలదు. అట్టి పట్టు

దల వహించుట సజ్జనలక్షణము కాదు. ధీరోదాత్తగుణమును గాదు. శ్రీవారిపట్టుదల యిట్టితర గతిలోఁ జేరినదికాదుకనుక నీచమానవులవలె రాఁబోవువిఘ్నములకు భయపడి మాను కొనుటగాని, మధ్యములవలెఁ బ్రారంభించి కష్టముల నెదు ర్కొనలేక జంకి మానుకొనుటగాని లేక యారంభించిన కార్యము చివరదాఁక నిగ్రహింపఁబడుచునే యుండెడిది. వీరి సత్యదీక్షయు, మానసోత్సాహమును, నాత్మధైర్యమును, వీరికి సర్వకార్యములయందు దిగ్విజయము చేకూర్చుచుండెడివి.

ధైర్యసంపన్నుల కెప్పుడును సంతాప మనుమాట యుండదు. మానవులకు ధైర్యమే భూషణము. ఈ ధైర్య లక్ష్మి శ్రీరాజాగారిని జిన్నతనముననే వరించియుండె. శ్రీవారి జీవితసౌధము ధైర్యమూలబంధముపైఁ గట్టఁబడియె. వీరికి నుగ్గుపాలనాఁటనుండియు ధైర్యమనుగుణము పట్టుపడి యుండె. అదియే శ్రీవారికి లోకఖ్యాతి నార్జించినది. అదియే శ్రీవారి యశోవల్లికను దిగంతములకుఁ బ్రాకఁజేసినది. అదియే ఖండాంతరములయందుఁగూడ శ్రీవారి కొక యు న్నతస్థానమును గల్పించినది. మానవుల కుండవలసినగుణ ములలో నిదియే ప్రధానము. ధైర్యగుణము కొఱవడి తక్కుంగలగుణము లెన్ని యున్నను బ్రయోజనము సున్న. ధైర్యగుణ మున్ననాఁడు తక్కినసద్గుణము లన్నియు వాని వశమునందే యుండును. చివర కదృష్టదేవతకూడ ధీరోదార గుణరత్నాకరునే వరించును.



శ్రీ రాజా వేంకటకృష్ణారావు బహద్దరువారి విమానయానము

6. విమానయానము

విమానమును నడపుటయన నసామాన్యవిషయము. దాని నలవరచుకొనుటకున్ను ధైర్యసాహసములును బుద్ధికుశలతయును, బట్టుదలయును గలవాఁడై తత్కళావిశేషము నందుఁ బరిచయమును సంపాదించుకొనవలయును. ఎట్టికళలైనఁ బుణ్యులకుఁ బూర్వజన్మార్జితసుకృతవిశేషమునఁ దమంత లభించుచుండును. శ్రీకృష్ణరావుప్రభువర్యులు సర్వకళలయందునుఁ బ్రబలప్రౌఢిమ సంపాదించినవారు. అందు విమానమును నడపుటలో నద్వితీయులని ప్రఖ్యాతిఁ గాంచినవారు. ప్రాక్పశ్చిమదేశములందు నీకాలమున విమానములు నాఁడునాఁటికి వృద్ధిపొందుటంజేసి తద్గమనాగమనకౌశలమున నారితేఱిన మహాయోధులు పెక్కుమంది కలరు. వారిలో నాంధ్రదేశమునఁ గృష్ణరావుబహద్దరువారు ప్రథమగణ్యులు. ఆంధ్రదేశమే యననేల యాసేతుహిమాచలము దేశీయరాజేంద్రులలో నేతత్కళాప్రవీణతం బ్రశస్తిగనిన మహావీరులు శ్రీవారుమాత్రమే యని నిస్సంశయముగను ఘంటాపథముగను జాటించవచ్చును. శ్రీవారు తత్పరీక్షలలో ఏ. పైలెట్టునందుఁ గృతార్థులైనారు. స్వీయపిమానయాత్రచేఁ దమసన్మిత్రులకుఁ, జూపఱకు నానందముగూర్చుచుండెడివారు. తమవిమానయాత్రా విశేషములచే ఖండఖండాంతరవాసులను గేవలకళానైపుణ్యముననేకాక

వాచానైపుణ్యమునఁగూడ నేతత్కాళ స్వీయకళ యని గర్వించుచుండిన యనేకాంగ్లేయసోదరులను బరిచితులుగాను స్నేహితులుగాను గావించుకొనిన ప్రథమాంధ్రవీరులు. ఇందుల కలహాబాటునకు వచ్చిన విమానయాత్రాచరణ రసికులను జూడఁ జనుదెంచుటయే, యందు వారిపరమాసక్తిని జెప్పక చెప్పుచున్నది. తమ విమానవిజయయాత్రాకాలములయందుఁ దమపురోభివృద్ధిఁ గోరినపెద్ద లగుస్నేహితులు "సాహసము వలదు; నీకు విజయ మగుఁగాక" యని మంగళాచరణముగ వచించువాక్యమునందుఁ గల 'సాహసము వల' దను భీతభీరోక్తి విననొల్లక చిడిముడిపడుచు ధీరతాద్యోతకముగ వ్రేలు పైకిఁ జూపుచు "***Fear none but God***" అని మిత్రులకెల్ల వీరసందేశ మొసంగి యత్యుత్సాహమున యాత్ర కకుతోభయులై వెడలుచుండెడివారు. అట్లుః వెడలుటయేకాక తత్తత్క్రీడారంగములందు సర్వదా విజయలక్ష్మీవిభాసితు లగుచుండిరి. దాననే చెన్నపురియందు స్థాపింపఁబడిన వైమానికమండలి "Flying Club" కి (Vice-Chairman) ఉపాధ్యక్షపదవి నలంకరించు నుత్తమార్హతఁ గాంచిరి. శ్రీవారు విమానవిహారమహాసాహసికులును, బహుచాతురీకలితులు ననుటకాకాశమున 12,000 అడుగుల (సుమారు 7 మైళ్లు) యెత్తునకుఁ బోవుటయు, నక్కడ నానావిధకళానైపుణ్యమును జూపుటయు, గంటకు 90 మైళ్ళ వేగమునఁ బరపించుటయుఁ బ్రబలనిదర్శనంబులు.

ఔరా! పురుషు లెంత ధీరులైన నేమి, యెంతభోగులై ననేమి, యెంత త్యాగులైన నేమి, యెంత సత్యనిష్ఠాగరిష్ఠులైన నేమి, యెంత దీనజనసంత్రాణబద్ధకంకణులైన నేమి, యెంత దయాసముద్రులైన నేమి దుర్విధిని ధిక్కరింప నసమర్థులే కదా!

25-8-1935 న శ్రీకృష్ణారాయబహద్దరువారు స్వీయ సంఘకార్యనిర్వహణార్థమై సుదూర దేశము పోఁదలఁచి యథాచారము తనయుచితకృత్యముల నెల్లఁ దీర్చికొని, యిష్టదైవమునకుఁ బ్రణమిల్లి, ప్రతివాతవర్షపాతదుర్నిమిత్తములకు శంకించుబంధుమిత్రుల సెలవుగైకొని తమయుత్తమ విమానముపై మఱి యిద్దరు స్నేహితులతో బయలువెడలిరి. కార్యశూరులు కాలయోగములకు జంకుగొనరుగదా! శ్రీవా రెట్టివిషఘటికయం దిలు వెడలిరోగాని కొలఁది మైళ్ళు పోవునంత వాతాడంబరము ప్రభూత మయ్యెను. ఎడనెడ జడివాన విడివడి వర్షించెను. విమానవేగము నిరుద్ధమై యది వెనుకకుఁ బ్రక్కలకు నెట్టివేయఁబడఁ దొడఁగెను. కొన్నియెడల నది తలక్రిందుగఁ దిరిగి పోవుచుండెను. అయినను బ్రచోదకులగు శ్రీవారు దమ నేర్పుకొలఁది విమానమును సన్మార్గమునఁ బఱపుచు నెల్లూరుపట్టణప్రాంతమునఁ బొన్నలూరు గడచిపోవుచుండిరి. నిమిషనిమిషము ఫెళఫెళమని యుఱుమునుఱుములు చెవులు గడియలువడఁజేయఁదొడఁగెను. ధళక్కుధళక్కుమని మెఱముమెఱపులు కనుల మూఁతలువడఁజేయఁ దొడఁగెను.

దడదడ ఆలు రువ్వినవడువున విడఁబడి జడివాన జోరున వర్షించుచు దిక్కు దెలియనీయదయ్యె. దశదిశావిస్తృతమై మహాపాదపోత్పాటనపాటవమైన ప్రళయఝంఝూవాత హతకుఁడన్నిటిని దలదన్ని విమానముతో వైమానికుం గూడఁ గిట్టి, యొక్కపెట్టఁ జుట్టుముట్టి తనకట్టిఁడితనముం జూపసమకట్టె. పలుగురు దుండగు లేకమై యొకయెడ ముట్టడించిన నెట్టిదిట్టఁడైనఁ బట్టువడకుండు టెట్లు? ధైర్యమువీడక 'నిగ్రహించు టెట్లొ' యని శ్రీకృష్ణారావుబహదరుగారు సమాలోచించుక్షణముననె తటాలున విమానసవ్యపక్షము విక్షిప్తమై బహుదూరమున నెందో భూమిపైఁ బడిపోయెను. తదుత్తరక్షణముననె దక్షిణపక్షముగూడ నక్షివిషయము గాకపోయెను. 'ఔరా! యనర్థపరంపరాప్రకార' మనుకొనుచుండఁగనే యొక్కతోరపున రంయ్యమని విమానము రెక్కలుతెగినపక్కివలె నిలువుగా నింగినుండి నేలంబడి తనయొడయనితో లోఁతునఁ బాతికొనిపోయె.

కట్టా! విధివిపాకము! వేంకటకృష్ణారావుబహద్దరుగారి మాయాభౌతికదేహ మిట్లు మంటిపాలయినది. ఖేచరుల కనులమంట చల్లారినది. వెక్కసపడు జక్కులరాయఁడు బ్రతుకుజీవుఁడా చిక్కుతీరిన దని తనతుక్కుయానమును జక్క చేయించెను.

తీఱనికడుపుకోఁత యేర్పడుట నాంధ్రమాత బిట్టువాపోవుచున్నది. వైమానికనాయకులు తమతలమానికము మాయమయ్యె నని కూయిడుచున్నారు. బంధుమిత్రభృత్యుల

వంత కంతు గానరాదు. అనుఁగుంగూఁతు నిచ్చి యద్దు ముద్దులు సూచుకొనుచు దౌహిత్రసంపదం గని యానం దించి, యెన్నఁడు నెట్టివిచార లేశము, నేకోశమునను గొనక ముందుగ శ్రీ శ్రీ శ్రీ రాజా సురభి లక్ష్మారాయబహద్దరు గారు స్వర్గ మలంకరింపఁగల్గుట ధన్యులైరి గాని నిరం తరధర్మవ్రతశతాచరణక్లేశకృశీభూతలును, జరాజర్జరితాం గులు నగు శ్రీ శ్రీ మహారాజ్ఞి వేంకటరత్నమాంబగా రాఱని దుఃఖముపాలుగాక తప్పినదిగాదు. కడుపారఁగని, పెంచి, పెద్దనొనర్చి, నిజవంశవివర్ధనుఁ డనియు, నిజప్రతిష్ఠాకారక జ్యేష్ఠుఁ డనియుఁ, గన్నుంగొలనియుఁ బేరాసపడు మూఁడు గాళ్ళముద్దలు తలిదండ్రులు జీవచ్ఛవంబు లైరి. అథము శుభము నెఱుఁగని నిసుంగుల యనభివ్యక్తావస్థం గనిన గుండె నీరుగాక నిలువఁగలధీరుఁ డుండునా! ఇఁక నర్ధాంగీత్వ మునఁ దన్మయ యగు నిల్లా లీవికటాభిఘాతముచే సర్వ స్వాపహృతయగుట నెట్టిదురవస్థం జిక్కియుండునో యభిజ్ఞ లూహింపఁదగునేగాని వ్రాయఁజేయాడకున్నది. 'పుత్త్రి వతి యగు శుద్ధాంతకాంత యింతసాహసింపరా' దను స్త్రీ యా ప్తహితోక్తిపాశములే తన్ను బంధింపకుండినఁ దా నింట లేక నాథుఁ డొంటి నుండఁగా దయ్యపుఁదుంటరుల జంటగొని కృతాంతహతకుఁ డొనర్చినయీదురంతమునకు శ్రీ సరస్వతీ మహాసతి వారిని వెన్నంటి తగినశాస్తి గావించి, తప్పక తననాథుని వెంటఁగొని వచ్చియుండెడిదియె. మూలల నంటి యెచటికేతుంటరు లచటన కంటఁబడక కాలికి బుద్ధిసెప్పిరి కాని

లేకున్న వీరకిశోరము మామురళీకృష్ణుఁ డొక్కఁడ బారువెట్టి వారి నందఱ నొక్కత్రేటునఁ గాల్చివైచి యుండువాఁడు.

ధర్మకల్పవల్లు లగు శ్రీశ్రీశ్రీ జటప్రోలు మహారాజ్ఞీమతల్లులు నిజజామాతృమహోదయులగు శ్రీకృష్ణారావు రాజాబహద్దరువారిపేర నొక యుద్యానవనమును నిర్మించి తమతోపాటు శ్రీకృష్ణారాయప్రభుచందురుల వియోగదుఃఖమునఁ గృశించు కొల్లాపురీప్రజలకుఁ గొంత ప్రశాంతి గల్పించిరి. అంతియగాక "జఫర్ మైదానమందు" శ్రీరాజావారి శిలాప్రతిమా స్థాపనముం గావించుటకుఁగూడ సంకల్పించిరి.

సన్మిత్రులగు 'వైమానికమండలి' వారు శ్రీవారి గౌరవార్థమై "**Raja I. V. Kristna Rao Silver Cup**" అను నొకదానిని స్థాపించిరి. అద్దానిని శ్రీవారిబంధుసముద్రులును, భావుకులును, సకలవిద్యాభిమానులును, త్యాగమూర్తులును, గుణాభిరాములును, సుకవితాప్రియులును నగు శ్రీశ్రీశ్రీ పీఠికాపుర యువరాజాబహద్దరుగారు ప్రేమపూర్వకముగ నర్పించిరని యీక్రింది ప్రకటనమువలనఁ దెలిసెడి.

"FROM HINDU" Madras, July **17.**

Raja Kristna Rao Trophy.

Arrangements are being made by the Madras Flying Club for running a competition for the award of the 'Raja I. V. Kristna Rao Silver Cup'. The cup it may be mentioned, was endowed by the Yuvaraja of Pithapur, in memory of the late Raja I. V. Kristnarao, a keen aviator and sometime Vice-Pre-

sident of the Club. The Raja it will be recalled died under tragic circumstances with two other members of the Club in a plane crash last August at Ponnalore near Nellore. The Cup it is learnt will be a rolling cup, awarded each year to the winner of the competition to be held by the Club. The competition will be open only to members of the Club and will include a short cross country fight.

ఔరా! కాల మలంఘ్యము. విధికృత్యములు దురవగాహములు. మహాత్ముల జీవితములాకల్పాంతస్థిరములు. కర్మగతులు గహనములు. సంకల్పవికల్పములును, సుఖదుఃఖములును, యోగవియోగములును, బరమేశ్వరాధీనములు. పరమేశ్వరుని సంకల్ప మమోఘము. ఇందుకు శ్రీకృష్ణారామ బహద్దరువారి నామమునఁ బ్రసిద్ధిఁగన్న 'కృష్ణ' యను నక్షరద్వయము శ్రీవారి సకలబంధుహితవర్గములకు నొక మంత్రమట్టుల నిరంతరజప్యమై విఖ్యాతమగు నట్లొనర్చుట కంటె వేఱు నిదర్శన మేల ?

పరమేశ్వరుఁడు శ్రీవారి యాత్మకు సంపూర్ణశాంతి నొసంగుఁగాక! శ్రీవారి జీవితచారిత్రము నొక మహాప్రబంధనిర్విశేషముగ నాచంద్రతారార్కము నిబంధించుఁగాక! శ్రీవారి సద్వంశకల్పతరు వాకల్పము శాఖోపశాఖావిస్తృతమై నానాకవిసంతానాశ్రయమై యలరారున ట్లనుగ్రహించుఁగాక! శ్రీవారి చిరంజీవుల కాయురారోగ్యైశ్వర్యాభివృద్ధి సమృద్ధిగ ననుగ్రహించుఁగాక !

7. సతీవిలాపము

భర్తృవియోగదుఃఖ మిల్లాండ్రకుఁ బరమదుస్సహము. పెరదుఃఖము లెట్టివి వేనవేలు పైఁబడినను నెట్టివేయఁగలుగుదురుగాని యీదుఃఖమునకు మాత్రము కట్టువడకపోరు. పాణిగ్రహణసుముహూర్తము మొదలుకొని తనువులు వేఱుగఁదోఁచుచున్నను నాత్మ యొకటిగ మెలఁగుచుఁ, బరిణతప్రేమసారమై యన్యోన్యాశ్రయమునఁ గన్నులపండువుగ నలరు మిథునమునకు వియోగ మేర్పడిన నంతకంటె నసహ్యము వేఱుండఁబోదు. అందును బురుషవియోగమున లతాంగి, మాధవవిచ్ఛేదమున మాలతివలె నేలఁబట్టకపోదు. అన్యత్ర స్త్రీ లెంతధీరలయ్యు నీవిషయమునఁ గేవలమబలలే.

శ్రీ శ్రీ సరస్వతీదేవీమతల్లిమాత్రము ప్రకృతిబద్ధగాక యెట్లుండును? ఆయమ్మ పడునవస్థ వర్ణనాతీతము. పొడినుడులతోఁ బొక్కి—పొక్కి, చిక్కి—చిక్కి, తుదకు, గ్రుక్కదిప్పికొని, విజ్ఞానవతియుఁ గవయిత్రియు నగుటఁ దన విలాపము 'నిత్యప్రార్థనా' గ్రంథరూపమున ఛందోబద్ధము గావించి ధన్యమైనది. నిస్సారవాక్యాంతరములఁ దద్భావముల వివరించుటకంటె యథామూల మది సాంతముగ నిందుఁ బ్రకటించుట యుక్తతరము; కాని గ్రంథవిస్తరభీతిని గొంతమే ప్రకటితము. సమగ్రముగఁ బఠించి, యిది ప్రత్యేక

కావ్యముగ నుండఁదగునని డాక్టరు, ఆంధ్రసాహిత్యచక్రవర్తి, బ్రి. శ్రీ. చిలకమర్తి లక్ష్మీనరసింహముగారనుగ్రహించిన పీఠిక సర్వభావసంగ్రహద్యోతక మగుట నిందుఁ బ్రకటింపఁబడియెడి.

* * *

"పూర్వకాలమున భరతఖండమున సంస్కృతభాషలోనేగాక దేశభాషలయందుఁగూడఁ బెక్కండ్రు కవయిత్రీమణులు కలరనుమాట నిర్వివాదాంశము. గీర్వాణభాషలో రాజశేఖర మహాకవిపత్నియైన యవంతిసుందరి గొప్ప విద్వాంసురాలనియు నలంకారశాస్త్రమున నవంతిసుందరీమతమని ప్రత్యేకముగా నొకమతము కలదనియుఁ, బండితులు వ్రాసియున్నారు. ఈమెగాక లీలావతి మొదలగు కాంతారత్నములుగూడ దేవభాషలోఁ గవిత్వముఁ జెప్పి ప్రఖ్యాతి గాంచినట్లు మనము వినుచున్నాము. దేశభాషలలోఁగూడ నట్లే మధురకవిత్వములు చెప్పి రసికజనమానసముల రంజింపఁజేసినకవయిత్రీమణులు కొందఱు గలరు. అరవబాసలోఁ గవనము చెప్పిన యవ్వయార్ వారిలో మొట్టమొదటిది. దేశభాషలందు లెస్సయైన తెనుఁగునందు మొల్లయు, ముద్దుపళనియుఁ, దరిగొండ వేంకమ్మయు నవరసములు చిప్పిలునట్లు కావ్యములు రచించి, విద్వజ్జనమాననీయులైరి. సామాన్యస్త్రీలేగాక యసూర్యంపశ్యలైన యంతఃపురకాంతలుకూడ విదుషీమణులై కవనముచెప్పి రని మనము వినుచున్నాము. కృష్ణదేవరాయల భార్యలలోఁ

నొకర్తె రచియించినవని పండితులు కొన్నిశ్లోకములు చదువుదురు. ఆరాయలకుమారికలలో నొక్కరిత మహాప్రబంధము నొకదానిని విరచించినట్లు చెప్పి విద్వాంసులు దానిలోనివని కొన్ని పద్యములు చదువుచున్నారు. స్త్రీగానమెంతమనోహరముగా నుండునో పాండిత్యము సంపాదించి కావ్యము రచియించిన స్త్రీకవనముకూడ నంత మనోహరముగా నుండునని నాయభిప్రాయము.

కరుణరసపూరితమైనయీచిన్నికావ్యమును, రచియించినవిదుషీమణి జటప్రోలు సంస్థానాధిపులును, దానరాధేయులును, శూరశిఖామణులును, విద్యావినోదులును, పండితపక్షపాతులునై కీర్తికాయముతో మృతజీవులైయున్న శ్రీసురభి లక్ష్మారావు బహదర్ వారి పుత్రికారత్నములలో ద్వితీయరత్నము. శ్రీరాజా యినుగంటి వేంకటరమణరావు బహదర్ వారి కుమారరత్నమై, సుగుణరత్నాకరులై, పండితపక్షపాతులై, శూరాగ్రేసరులై, బహుకళాకోవిదులై యాంధ్రదేశముయొక్క భాగ్యదోషమున గీర్తిశేషులైన శ్రీరాజా యినుగంటి వేంకటకృష్ణారావు బహదర్ వారి ధర్మపత్ని. ఈమెనామధేయము శ్రీసరస్వతీదేవి. విద్యావతియై సరసకవిత్వము చెప్పనేర్చుటచే సరస్వతీనామధేయ మీయామెయందు సార్థకమైనది.

భర్తగారైన వేంకటకృష్ణారావు బహదర్ వారు బహుకళాకోవిదు లగుటచే విమానములు నడపుకళగూడ నేర్చుకొని యొకవిమానమును సంపాదించి దానిపై

నెక్కి తామే దానిని నడపుకొనుచు, విమానారూఢుఁడై విశ్వమెల్ల సంచరించినయుపరిచరవసుమహారాజువలె స్వేచ్ఛావిహారము సలుపుచు దైవవశమున 1935 సం॥ ఆగస్టు నెలలో నెల్లూరుసమీపమున విమానము భగ్నమగుటచేఁ బరమపదము నొందిరి. భర్తృవియోగదుఃఖమును వెలిపుచ్చుటకే యీకావ్య మాసాధ్వీమతల్లిచే రచియింపఁబడినది. ఈపతివ్రతాశిరోమణి యీకావ్యమున వెలయించినభావములు, కరుణరసమును వెలిపుచ్చుచున్నవి. ఈ గ్రంథము చదివినప్పుడు, కాళిదాసవిరచిత మైనకుమారసంభవములోని రతివిలాపము జ్ఞప్తికి వచ్చుచున్నది. జాలిగొలుపుచున్న యీపద్యములు విన్నవారి హృదయములు కరఁగిపోక మానవు. కన్నీరు జొటజొటఁ గారక మానదు. మనసు విచారమగ్నము కాకపోదు. శ్రీసరస్వతీదేవిగారి కిది ప్రథమప్రయత్నమైనను గవనము రసవంతమై సర్వజనహృదయంగమమై యుండుట మిక్కిలి శ్లాఘాపాత్రము. పతియే దైవమని నమ్మినపడంతికి భర్తృగుణవర్ణనముచేసి యామహనీయునిచరణారవిందములు హృదయమున నిలుపుకొని తచ్చరిత్రము పద్యరూపమున గానముచేయుచుఁ, గాలక్షేపము చేయుటకంటె నపేక్షణీయ మేమున్నది? భర్తృగుణకీర్తనముచేత నీసాధ్వీశిరోమణి నేర్చినకవిత్వమును ధన్యము చేసికొన్నది, జన్మము చరితార్థము చేసికొన్నది, తోడిపడంతులకు మార్గదర్శిని యైనది. కవిత్వము రసవంతమై ప్రశంసనీయమై యున్నదనుమాట యతిశయోక్తి గాదు. సర్వవిధ

ముల నీగ్రంథ మాంధ్రమహాజనులకు నందు ముఖ్యముగ నారీమణులకు నాదరణీయమై పఠనీయమై యున్నది.

శ్రీజటప్రోలు మహారాజ్ఞిగారి పుత్రరత్నమునకును, మనుమలకును గురుమహాశయుఁడును, శ్రీసరస్వతీదేవిగారి కవితాగురువును, నాకు శిష్యుఁడును, మిత్రుఁడును, పరమాప్తుఁడును, సుకవియు, స్నేహలతాకవితాసంస్థాపకుఁడును నైన చిరంజీవి వాజపేయయాజుల రామసుబ్బారాయఁ డీగ్రంథమునకుఁ జిన్నపీఠిక వ్రాయవలసినదని నాకడకుఁ దీసికొనివచ్చి పద్యములెల్ల వినిపించెను. ఆపద్యములు వినినతోడనే నామనసుకూడ దుఃఖపూరితమైనది- కాని కావ్యదృష్టిం బురస్కరించుకొని రసవంతమగు నిట్టి గ్రంథమునకుఁ బీఠికయైన వ్రాయుట యపేక్షణీయమై యుండును గాన నే నిందుల కియ్యకొంటిని.

స్త్రీలు కవిత్వము చెప్పుచున్నా రనుమాట నావీనులకు విందు. అందు శుద్ధాంతకాంతలు చెప్పినకవిత్వ మంతఃపుర స్త్రీలవలెనే ఘోషాగలిగి పరదాచాటున నణఁగియుండక ప్రచురమగుట నాకుఁ బరమానందకర మైనవిషయము. ఈకవయిత్రీమణి యాంధ్రనారీమణులకు నుపయోగకరములైన గద్యపద్యకావ్యములను రచియించి, దేశభాషాసేవలను జేయునట్లు పరమేశ్వరుఁ డనుగ్రహించుఁగాక !”

* * *

(నిత్యప్రార్థనాగ్రంథమునుండి)

మ. కర మొప్పం దగురీతిఁ దత్త్వవిధుల న్ధ్యానానురాగమ్మునన్
వరుసన్ బోధయొనర్చినావు మిగులన్ వర్ధిల్లె నాబుద్ధి నీ
వరయంగాఁ బరమేష్ఠికల్పుఁడవుగావా? నీదులీలాకృతిన్
మఱవన్ శక్యముగాదు నాకు మహితాత్మా! కృష్ణభూపాలకా!

మ. అరయంగా భవదీయమానసము నిత్యంబద్భుతాధ్యాత్మత
త్త్వరసాస్వాదనతత్పరంబగుచు నుత్కంఠాదృతిం జూపుఁగా
ని, రహిం గోరదు తుచ్ఛభోగముల, నిర్నిద్రంబు నీబుద్ధి; ని
న్మఱవన్ శక్యముగాదు నాకు మహితాత్మా! కృష్ణభూపాలకా!

మ. సరసంబౌ భవదీయనామ మమలస్వాంతంబునన్ భక్తులె
ల్లరుఁ గీర్తించి తరించిన ట్లబల నల్పజ్ఞన్ విలోలాత్మ నే
కరణి న్నిన్ను భజింపనేర్తు? భవదుఃఖం బెట్లుపోకార్తు? ని
న్మఱవన్ శక్యముగాదు నాకు మహితాత్మా! కృష్ణభూపాలకా!

మ. పరులన్మిత్రులఁబోలెఁజూతు వెదసంభావించి, లాలించి, యా
దర మొప్పన్ ధనమిచ్చి ప్రోచెదవు సద్ధర్మానురాగంబుతో
నొరులన్ దీనులఁ గాంచినంతటనె యుద్యోగమ్ము లర్పించి, ని
న్మఱవన్ శక్యముగాదు నాకు మహితాత్మా! కృష్ణభూపాలకా!

గీ. దానమందునఁ గర్ణుని దాఁటినావు
శౌర్యమందున నీ కేరు సాటి లేరు
ధార్మికతయందు ధర్మావతార మనఁగఁ
గీర్తిఁ గాంచితి వీవు శ్రీకృష్ణభూప!

ఉ. ఎట్టిజపంబు సేసితినొ యెట్టితపంబులఁ బూనియుంటినో
యెట్టివిశేషదానముల నిచ్చితినో తొలిబామునందుఁ జే
పట్టితి మిమ్ము వంటిగుణవంతుని వీరుని లోకమాన్యునిన్
గట్టిఁడి బ్రహ్మ నిర్దయతఁగాంచి మిము న్విడఁజేసెనక్కటా!

చ. కలకలలాడుమీనగు మొగంబును గాంచిననాఁటనుండియు
న్వెలవెలఁబోయె నెమ్మనము నీరజలోచన! యేమిసెప్పుదున్
గలవరపాటుతోడఁ గలకాలము నీగతి మిమ్ము వీడి నే
నిల భరియింపఁగాఁగలనె? యిట్టియభాగ్యపుజీవితంబిఁకన్.

చ. పరమదయాలవాల మగుభావము గాంచినమిమ్ము వీడుట
న్జిరసముపార్జితం బయినచెల్మి నశించెను దిక్కు దక్కు దు
ష్కరతరదుఃఖ మేర్పడె జగం బడరెన్నిరయంబుగాఁగ, నీ
విరహదవాగ్ని నన్నుడుక వెట్టెడి భస్మమొనర్పదో ప్రియా!

చ. గుణమణిరాశివంచు నినుఁ గోరి వరించిననాఁటనుండి ని
న్ననయముసఖ్యభక్తులమహాదృతిఁగొల్చుచునుంటిఁగాదె? మ
న్ననవిడి మానినిన్ నను ననాథగ నీగతి నొంటిఁద్రోచితే
యనఘచరిత్ర! నాబ్రదుకు వ్యర్థము నిన్గనలేమి మేదినిన్.

ఉ. జీవము నాదుసొమ్మనుచుఁ జెప్పితి వీవు వివాహవేళ నా
భావ మనన్యభావమొ యభావమొ? లేక మనమ్మునందు నే
భావము నెంచి నీ విటులఁ బాసితివో తెలియంగరాదు నా
భావముమాత్రమెన్నఁడును బాయదు నీపదపద్మయుగ్మమున్.

ఉ. నే నొక బాసఁ జేసెదను నెచ్చెలి! విన్ము పురాకృతమ్మునన్
నే నినుఁ గోలుపోయితి, ననేకవిధమ్ముల నూఱడిల్లినన్
మానదు దుఃఖ మెంతయును మాటికిమాటికిఁ బొంగివచ్చెడి
న్నే నెటొ నాల్లునా ళ్లిచట నిల్చి వడి న్దివి నిన్నుఁ గూడెదన్.

మ. పతియే దైవమటంచు నెంచి మది సంభావించి ప్రేమించి సం
తతము న్నీమృదుపాదపద్మములకు న్నామ్రొక్కు లర్పించుచున్
వ్రతమన్న న్జపమన్న భాగ్యమనిన న్నాకెప్డు మీరంచు స
మ్మతి సేవించుట మీ రెఱింగియును నన్బాయంగ నాయంబొకో?

మ. పరదేశమ్మున కేగునప్డు నను సంభావించి లాలించి నీ
వరయన్ వీడఁగలేక వీడుటలు నేఁడాత్మన్ విచారింపఁగాఁ
గరమున్ దుఃఖమువచ్చు నిట్టియెడ నాకారుణ్యమెందేగెనో
పరలోకమ్మున కెట్టు లేగితివొ? నన్బాయంగ నెట్లోర్చితో?

ఉ. మూఁడుదినంబు లేగకయె మోదమెలర్పఁగ వత్తునంచు నీ
వాడినమాటలన్ దలఁచి హాయిగ నేగితిఁగాని యక్కటా!
పోఁడిమిఁదక్కి నన్నిటుల మోసముచేసి దివంబుఁ జేరి, తే
నాఁడును నిట్టులౌనని మనమ్మున నెంచఁగనైతి భూవరా!

ఉ. ఎప్పుడు తెల్లవారు మఱియెప్డు దినత్రయ మేగు నింక నే
నెప్పుడు మీముఖాంబుజము నేర్పడఁ జూచెడు భాగ్యమబ్బునం
చెప్పటికప్పుడే దినము లెంచుచునుంటిని గాని యక్కటా!
ముప్పు ఘటిల్లునంచుఁ దలపోయఁగనైతిని ప్రాణనాయకా!

ఉ. అట్టి కఠోరవార్త వినినంతటనైనను గుండె వ్రీలి ని
న్నెట్టులనైనఁ జేరుటకు నెంచనిజీవిత మేల నాకు? నె
ప్పట్టుననైన శాంతిఁ గనవచ్చునె? తాపముఁ బాయ నేర్తునే?
యిట్టులె పొక్కిపొక్కి కృశియింపుమటంచు విధాత వ్రాసెనే?

గీ. అట్టిసుకృతంబు నా కేటి కబ్బుఁ? దొంటి
బామునం దొనరించిన పాపఫలము
ననుభవింపక తీరునే? యైనఁ బగుల
దెట్టిలోహనిర్మితమొ నాహృదయ మకట!

గీ. బూదిఁ బోసినపన్నీరువోలె, నడవిఁ
గాచినట్టి వెన్నెలమాడ్కి, నోచినట్టి
నోము లన్ని వ్యర్థము లయ్యె నేమి సేతు?
నీవు లేనట్టి బ్రతుకు కింక నిష్ఫలంబు.

ఉ. పిల్లల కొండుదారి కనుపించదు, నీసుకృతంబు పెంపునన్
మెల్లగ జారినావు మితిమీఱినదుఃఖమహాంబుధిన్ మమున్
దొళ్ళఁగఁ ద్రోచి, యిట్లుతగునే? భగవానుఁడె దిక్కటంచు నీ
వల్లనఁ జెప్పుసూక్తులె కటా! శరణంబులు మాకు భూవరా!

శా. ఎన్నంజాలుదు నీపదాబ్జయుగమే యెన్నాళ్ళకైనన్ నను
న్మన్నింపంగదె నిన్ను వీడఁటను యుష్మద్దివ్యనామాళినే
యెన్నంజాలు మదీయజిహ్వయును నిన్నే భర్తగా నెంతు నే
నెన్నండైనను జన్మజన్మములకున్ గృష్ణా! మనోనాయకా!

ఉ. సీతలిదండ్రులన్న ధరణీధవ! వృద్ధులటం చెఱుంగవో
చేతము దుఃఖదుర్భరతచేఁగడుఁబొక్కఁగఁగన్నులుండియున్
సీతనుభాగ్యముం గనఁగనేరక వారట నంధులైరి; నా
థా! తపియింపఁజేయుటలు ధర్మమె జీవితశేషమంతయున్?

ఉ. చిన్నతనంబునుండి నినుఁజేరి సుఖించుచునుంటి నాత్మలో
నెన్నఁడు నిన్నుఁబాసి వసియించినదానను గాన; యట్టిసి
యన్నులమిన్నయైనననున్యాయ్యమెపాసిచనంగనింకెటుల్
తిన్ననిమార్గ మేర్పడు సుధీవర! వేంకటకృష్ణభూవరా!

సీ. శ్రీధర! నీ కెప్డు సేవసేయుటెకాని
యన్యుల సేవింప నరుగ నొకట
పుండరీకాక్ష! నిన్ బూజసేయుటెకాని
యితరపూజలఁ జేయ నెంచ నొకట
దైత్యారి! నీ కేను దండం బిడుటెకాని
పరులకుఁ జేమోడ్ప దరియ నొకట
పరమాత్మ! నీనామభజనసేయుటెకాని
తదితర మేదియుఁ దలఁప నొకట

గీ. ఇన్నివిధముల నినుఁ గొల్చుచున్ననాకుఁ
బ్రాణములకును బ్రాణమౌ పతినిఁ బాసి
పాడుబ్రదు కొంది జీవచ్ఛవంబ నగుచుఁ
జెలఁగుదౌర్భాగ్య మేల కూర్చితివి తండ్రి!

సీ. తలఁపులోఁ బ్రాణేశు దైవంబుగా నెంచి
ముప్పొద్దులందునఁ బూజసేసి
విభుఁడు పల్కినపల్కు వేదాక్షరంబుగా
నెల్లవేళలయందు నెంచుచుండి
పతిపాదపూజయే వ్రతమంచు నిత్యంబు
సద్భక్తితోడుత జరపుచుండి
పతిచిత్త మారసి పనులందు బహుభక్తిఁ
గలిగి యెక్కాలంబు మెలఁగుచుండి

గీ. వంక లేనట్టిమార్గంబుఁ బట్టుచుండి
యిరువదేడులు కాఁపురం బేను జేయఁ
బిన్నతనమందె నా కిట్టిపాట్లు కలుగఁ
జేయుటలు నీకు న్యాయ్యంబె? శ్రీనివాస!

గీ. ఎట్లు దాఁటంగ శక్యమా నీదురంత
మైనసంసారజలరాశిఁ? గాన, భార
మంతయును దేవ! నీవ మోయంగవలయు;
నావికుఁడ వీవ, దరిఁజేర్చు జీవనౌక.

మ. పతినిన్ బాసినదాది దుఃఖములకున్ బాలైతి నే నింక నే
గతి వేఁగంగలదాన దేహముపయిన్ గన్పట్టెఁ జీకాకు నా
వెతలన్బాపఁగలట్టివా రెవరు నీవేకాక యెట్లైననా ప్రభూ!
ధృతిమై దారినిఁజూపుమయ్య యిఁకఁ దండ్రీ! రామచంద్ర

చ. మెలఁగితిఁ బ్రాణ మొక్కటిగ మేనులు రెండుగఁ గానుపించినన్
గలిసితి నాత్మలోపలను గాంతుని బూవును దావిరీతి నేఁ
గలిసి సుఖాప్తి వర్తిలితిఁ గష్టమెఱుంగక యిప్డు దైవమా!
కలుగఁగఁ జేసితే పరులకష్టము లోర్వనినాకుఁ గష్టముల్.

ఉ. పిన్నటనాఁటనుండియును బ్రేముడిఁ జూపెడివాని స్నేహసం
పన్నతఁ గాంచువాని నిజభావము నాయెడ నుంచువాని నా
యన్నులమిన్న యంచు నను నాత్మఁ దలంచెడు ప్రాణనాథునిన్
గ్రన్నన మ్రింగెనయ్యయొయ కాలపుమృత్యువు వేంకటేశ్వరా!

గీ. అట్టిసద్గుణగణరాశి నక్కటకట!
కోలుపోయి యనాథనై కూలిపోతి
దారియున్ డొంకఁ గానక తల్లడిల్లు
చుంటిఁ గృపఁ గాంచి దరిఁ జేర్పు మోయి దేవ!

సీ. పతిముఖాబ్జముఁ జూచుభాగ్య మొందనికండ్లు
కండ్లుగా వవి పోర్లగండ్లుగాని
జీవేశునకుఁ బ్రదక్షిణ మొనర్పనికాళ్ళు
కాళ్ళుగా వవి కారురాళ్లుగాని
ప్రాణేశునామకీర్తనముఁ జేయనివాయి
వాయిగా దది పాడుగోయిగాని
ధవునకు సాష్టాంగదండ మీయనిమేను
మేనుగా దది ముండ్లమ్రానుగాని

గీ. కానఁ బ్రాణేశుఁ గొల్చుభాగ్యంబె భాగ్య
మట్టిభాగ్యంబుఁ గోల్పోయి యవిధి గుడుచు
నిట్టి కొఱగాని బ్రతుకు నా కిచ్చి తేల ?
దీనబాంధవ ! నా కేది దిక్కు కలదు ?

ఉ. నాన్నయటంచుఁబిల్లలు మనమ్మున శోకదవాగ్నితప్తులై
యన్నడుగంగఁ జెప్పుటకు నా కిఁక నోరెటులాడు దైవమా!
చిన్నతనానఁ గష్టములఁబెట్టితి వయ్యది గూడె బ్రిద్దలా
నన్నవిధంబునన్ మనము నాఱటఁబెట్టుచునుండునిచ్చలున్.

మ. నినుఁగీర్తించుచు నీకథల్వినుచు నిన్నే ధ్యానము న్జేయుచున్
మనమం దెప్పు డొకింతయేని మఱవన్ రాదంచు నన్గావుమం
చును నీవేయిఁక దిక్కటంచు ఘనమౌశోకమ్మునందున్న నే
ననయమ్మున్నినుఁగొల్తుఁబ్రోవఁగదె రామా! దీనచింతామణీ!

ఉ. పాలు జలంబు నేకమగుభాతిని నాదగుప్రాణనాథునిన్
జాలదినాలనుండి సరసంబుగఁగూడి మెలంగుచుండ నా
పాలిటిదైవమంచు నెద భావనసేయుచుఁ గొల్చుచుండ నీ
వేలొకొ? నిర్దయుండవయి యీగతిఁజేసితి వేంకటేశ్వరా!

చ. జననము వ్యర్థమాయెనని చాలఁగ స్రుక్కుచు నున్నదాన నే
ననయము శాంతివీడి మనమందున బెంగనుగాంచుచుంటి నే
మని వచియింపనేర్తు నిఁక నక్కట! ధైర్యము చిక్కదాయె నో
యనఘ! భవత్పదాబ్జముల నంటితిఁ బ్రోవుము వేంకటేశ్వరా!

ఉ. ఎట్టిమహాపరాధముల నేఁ దొలిబామునఁ జేసియుంటినో
యెట్టిగుణాఢ్యులన్ వెత వహింపఁగఁ జేసితినో? లేనిచో
నట్టినృపాలశేఖరు మహాత్ము గతాయువుగా నొనర్చి నా
కిట్టివియోగ మూన్పఁగలవే? దయమాలుచు వేంకటేశ్వరా!

ఉ. పిన్నతనంబునుండి ననుఁ బ్రేముడిపెంపున నాదరించి నా
పెన్నిధియై యహర్నిశము వీడని వేంకటకృష్ణరాయు నే
నెన్నిభవంబులెత్తినను నేమరుపా టొకయింత లేక బల్
తిన్నగఁ గూర్పుమా పతిగ దేవ! రమాపతి! వేంకటేశ్వరా!

ఉ కోరిక లెల్లనాకునొడఁగూర్చె ననుం బ్రియమొప్పఁజూచె సం
సారము నాపయిన్ వదలి శాంతిని నీదరి కేగె నిప్డు నే
తీరనిదుఃఖవారినిధిఁ దీరము గాంచఁగలేకయుంటి న
న్నారసి ప్రోవుమంటిఁ బరమాత్మ! తరిం దరియింపఁగూర్పవే.

మ. గురుగంభీరగుణాకరు న్విడుచుటన్ గోల్పోతి భాగ్యంబు
ర్భరవైధవ్యవిషాగ్నికీలల భరింపంజాల నన్నెట్లో నీ [దు
దరిఁ జేర్పంగదవయ్య నాపతిని సందర్శించుభాగ్యంబు చే
కుఱఁ జేయంగదవయ్య! కొల్తునెపుడున్ గోపాలచూడామణీ!

ఉ. అన్నలుదమ్ములున్ ధనబలాయము గూర్చినఁ గూర్చవచ్చు సం
పన్నతగల్గుతల్లి యభిమానము సూపినఁ జూపవచ్చుఁ దాఁ
గ్రన్నన బంధుకోటి యనురాగము పెంచినఁ బెంచవచ్చు సం
పన్నిధి యెంతగల్గినను వ్యర్థమగున్ బతిలేని భామకున్.

గీ. పతియె కులకాంత కెపుడు దైవంబు పరము
పతియె ప్రాణంబు మిత్రంబు పతియె గురువు
పతియె సర్వస్వమగు నట్టి పతిసుగతిని౯
బాయు సతి కన్యగతి గానఁబడునె జగతి.

సీ. పతినామభజనతత్పరతఁ జొక్కనిజిహ్వ
కలిగియే మిఁక నద్ది గలుగ కేమి ?
భర్తృపాదాబ్జసేవలఁ దరింపనిచేయి
కలిగియే మిఁక నద్ది గలుగ కేమి ?
హృదయేశసూక్తి సంప్రీతిఁ దేరనియాత్మ
కలిగియే మిఁక నద్ది గలుగ కేమి ?
దయితోపచారతన్మయతఁ బొంగని మేను
కలిగియే మిఁక నద్ది గలుగ కేమి ?

గీ. అబల కెంకును బతియె ప్రత్యక్షదైవ
మగుట సర్వేంద్రియముల నవ్యయసపర్య
సలుపుసతులకె యవి యున్నఫలముగాని
గలుగ దసతుల కవి యున్నఫలము సుంత.

సీ. పతిపాద మనయంబు భజియించుమా యంచుఁ
దగవొప్ప వచియించుతల్లి తల్లి
పతినామ మేవేళ నుతియించుమా యంచుఁ
దలఁచి బోధించుతండ్రి తండ్రి.

పతిసూక్తి నిరతంబు భావించుమా యంచు
గుణ మెంచి వినిపించుగురువు గురువు
పతిపూజ ముప్పొద్దుఁ బచరించుమా యంచుఁ
జెయి వంచి చేయించుచెలియ చెలియ

గీ. పతిని దైవంబుగా నెంచుభార్య భార్య
మగని నెవ్వేళఁ బూజించుమగువ మగువ
ధవునితోడిదె లోకంబు తరుణి కెపుడు
ప్రాణనాథుండెగతిసుమ్మ భామ కెందు.

12/55

8. గురుపరితాపము

[వాజపేయయాజుల రామసుబ్బారాయఁడు.]

సీ. ఏ ఱేఁడు పిలిపించి గారాబమున దరిఁ
జేర్చె బిడ్డలకు దేశికునిఁ జేసి
ఏ దాత నిరతంబు నెనలేనిగౌరవో
న్నతి నన్నుఁ జూచె సన్మాననియతి
ఏ దొర యెంతేని మోదమ్ము దైవార
వాంఛితార్థంబులఁ బడయఁ జేసె
ఏ రాజు కవి నంచు హితబుద్ధిఁ బోషించె
భాషాభిమానంబు ప్రబలునట్లు

గీ. అట్టి యినుగంటి కృష్ణరాయావనీంద్రుఁ
డవనిఁ బాసె ననఁగ దుఃఖ మతిశయించె;
నెట్లు సెప్పుదు నాబాధ యిట్టి దనుచు ?
దైవగతులను దెలియంగఁ దరముగాదు. 1

చ. ఎనిమిదివత్సరంబులు రహించితి బిడ్డలకున్ గురుండనై
యెనయఁగరానిభాగ్యముల నే డ్తెటఁగాంచుచునుంటినీకృప
ఘనుఁడవు రాజచంద్రుఁడవు గౌరవమారఁగ నన్నుఁ జూచుచుం
టినకృపయిం కెటుల్దొరకు నేఁడు మొదల్వచియింపు మోనృపా!

ఉ. ఈవు పరోపకారమన నెన్నఁడు వెన్కకుఁదీయఁబోవు సం
భావనసేయు దీవు కవిమాన్యుల; నాకవితాప్రసంగముల్
నీ వనయంబు నిచ్చఁగొని నిశ్చలభక్తిని విందు వక్కటా !
యేవిధి నిన్ను వీడి భరియింపఁగలాఁడను దుఃఖభారముల్.

ఉ. నేనన నీకుఁ బ్రాణమని నీవు వచింపఁగలేదె నాఁడు 'నా
సూనుఁడు మీగురుత్వమున శోభితుఁడయ్యెను, మీకు భూరిస
న్మానము సేయనొప్పు'నని మాటికి నీహృదయంబు విప్పి వా
గ్దానము సేయలేదె? కలఁగాంచినకైవడి నయ్యె నన్నియున్.

గీ. బ్రతుకుచుండిరి ప్రజలు నీప్రాపుఁ గాంచి
వారి నెవ్వారు పోషించువారు చెపుమ ?
నిన్నుఁ బోలినయాత్మవిభుండే గతింప
వారికై చింత యేటికో ప్రభువరేణ్య ! 5

ఉ మానవరాజచంద్రుఁడవు మాటయొసంగియొకింతదాటఁగాఁ
బూననివాఁడ వీవు పరిపూర్ణమనంబున బీదసాదలన్
మానక గాచుచుందువు సమానులెయెల్లరు నీకు, సప్తసం
తానఫలంబు గాంచితివి తక్కువ యేమిఁక నీకు? భూవరా!

గీ. కాని నీ వేగునుత్తరక్షణమునందె
మాకు లోటు గాన్పించె నోమనుజనాథ !
చెప్పనేటికి మాబాధ చిచ్చులోనఁ
బడినరీతిగ బ్రతుకంత వ్యర్థమయ్యె. 7

గీ. నాఁడు ప్రజలెల్లఁ బడినసంతాపభరమె
చెప్పకుండఁగఁ జెప్ప నీగొప్పశక్తి
మరల సృజియింపలే నిట్టిమాన్యు నంచు
బ్రహ్మయునుగూడ నాత్మలో వగవకున్నె ? 8

ఉ. నీజనయిత్రి పుణ్యతమ; నీజనకుండును బుణ్యమూర్తి; నీ
తేజు భరించుజాయయుఁబతివ్రత, తత్త్వనిరూఢ, మాన్య; నీ
వో జవసత్వముల్ గనినయుత్తమశూరుఁడ; విన్నిగూర్చి నీ
కాజలజాసనుం డెటు చిరాయువు గూర్పకపోయెనో గదా!

సీ. పండితుం డనినంతఁ బరమభక్తిని బిల్చి
మించువేడుక గారవించినావు
కవిచంద్రుఁ డనినంత గాఢభక్తిని బిల్చి
మించువేడుక నాదరించినావు
గాయకోత్తముఁడనఁ గడుభక్తిఁ బిలిపించి
మించువేడుకఁ బ్రస్తుతించినావు
గురుజనంబులటన్న గురుభక్తిఁ బిలిపించి
మించువేడుక సత్కరించినావు

గీ. సాధువులు బంధువులు దీనజనులు సేవఁ
జేయువార లటన్నను జేరఁదీసి
మించువేడుకతోడఁ బోషించినావు
కీర్తిధారేయ! యినుగంటి కృష్ణరాయ! 10

సీ. నిన్నుఁ జెప్పి పదపడి యిన్నుఁ జెప్పవలెఁగాదె
పరికటపరితాపసంప్రాప్తియందు
నిన్నుఁ జెప్పి వెనుక నిందురినిఁ జెప్పవలెఁగాదె
యతులితభోగభాగ్యములయందు
నిన్నుఁ జెప్పి పిదపఁ జందురినిఁ జెప్పవలెఁగాదె
భవ్యప్రసాదవైభవమునందు
నిన్నుఁ జెప్పి యవలఁ గామునిఁ జెప్పవలెఁగాదె
యిద్ధసౌందర్యసమృద్ధియందు

గీ. నిన్నుఁ జెప్పినవెనుకనే నిక్కముగను
జెప్పవలెఁగాదె కర్ణుని శిబినిఁ గామ
ధేనువును గల్పకంబును దానమందుఁ
గీర్తిధారేయ ! యినుగంటి కృష్ణరాయ ! 11

ఉ. దైవము దీక్షతో మనిచి దగ్గఱఁదీయఁదలంచువానిఁ దా
నేవిధినైనఁ బ్రాయముననే తనసన్నిధిఁజేరఁదీసికొం
చావల వాని కాత్మవిభవావళి నిచ్చి భరించునందు రో
పావనసచ్చరిత్ర ! భగవత్కృప నీవయి నిట్టులుండనా !

ఉ. సారములేనిమానవులజన్మము మెచ్చక కాఱుచీఁకటుల్
జేరకమున్న నిన్ను నడిపించెడినిర్మలధర్మబుద్ధి లోఁ
జేరిచి సర్వవేళలను శ్రీపరమేశ్వరభక్తిభావనా
పూరితమానసుండవయి పోయితివే దివికిన్ నృపాలకా! 13

సీ. నిన్ను దైవంబుగా నెన్ని పూజించెడి
కాంత శోకాగ్నిచేఁ గ్రాఁగుచుండ
నిన్నుఁ బ్రాణంబుగా నెన్ని మెలంగెడి
సన్మిత్రు లార్తిచే స్రుగ్గుచుండ
నిన్ను రక్షకునిగా నెన్ని సేవించెడి
సేవకుల్ దుఃఖంబుఁ జెందుచుండ
నిన్నుఁ గల్పకముగా నెన్ని యాచించెడి
యాచకుల్ గతిలేక యడలుచుండఁ

గీ. గన్నవారలు చుట్టాలు గాసిగుడువఁ
జక్క దివ్యవిమానంబు నెక్కి యూర్ధ్వ
లోకసంచారసుఖ మొంద నీకుఁ దగునె
కీర్తి ధౌరేయ! యినుగంటి కృష్ణరాయ! 14

ఉ. సేవకమానసాంబుజవశీకరణార్హవివక్ష పాండితీ
భావితసత్కవిత్వరసభావపరీక్ష కృపాకటాక్షసం
భావితసాధురక్ష జనభద్రదిదృక్ష పరోపకారభి
క్షావిధిదీక్ష నీకడ విచక్షణతం దగు నక్షయంబులై. 15

ఉ. భావవిశుద్ధి సర్వహితవాక్ప్రియకర్మసమృద్ధి శిష్టసం
భావితధర్మబుద్ధి కవిపండితపోషణధీవివృద్ధి వి
ద్యావినయార్థసిద్ధి యసహాయసమాదరణప్రసిద్ధి మై
త్రీవిభవాభివృద్ధి జగతీధవ! నీయెడఁ గానుపించెడిన్. 16

సీ. పరభామినీసహోదరుఁ డీతఁ డను నీతి
శాశ్వతం బగునట్లు జరిపినావు
సత్యభాషాహరిశ్చంద్రుఁ డీతం డను
దృఢచిత్రయశోఽర్థము సేకరించినావు
సంపూర్ణకారుణ్యసాగరుం డితఁ డన్న
మించువిఖ్యాతి నార్జించినావు
రసికావతంసుఁ డీరాజచంద్రుఁ డటన్న
పెద్దపేరు వహించి వెలసినావు

గీ. అతులవైమానికోత్తముఁ డనుయశంబుఁ
గాంచినాఁడవు ; వేఁట నీకంటె ఘనుఁడు
ధరణి నెందును లేఁడనఁ దనరినావు
కీర్తిధౌరేయ ! యినుగంటి కృష్ణరాయ ! 17

ఉ. అక్షయసత్కృపారసము సాదరమేదురచిత్తవృత్తి ప్ర
త్యక్షమహేంద్రవైభవసమంచితభూతి విశాలకీర్తి హ
ర్యక్షసమానకాంతి శరణాగతపాలనదీక్ష మీయెడన్
రక్షణఁబొంది రాజగుణరాజి విరాజిలుఁ గృష్ణభూవరా !

ఉ. నీతికిఁ బుట్టినిల్లు ధరణీసురకోటికిఁ బట్టుఁగొమ్మ పు
ణ్యాతిశయాకరంబు కరుణావరుణాలయ మాత్మభూమిప్ర
ఖ్యాతికి మూలకంద మహహా! శుభకీర్తికి తాణ యైన మీ
చేత సరస్వతీరమణచేతము భక్తిపరీత మయ్యెడిన్. 19

శా. నీవైమానికవిద్య నిర్జరులకున్ నేర్పింప నూహించి యా
దేవేంద్రుం గన నేగియుంటి వనుబుద్ధిం బొంది కాకున్న మా
భావం బేగతి సైపఁ జాలును హతాత్పాతంబుచే నీవిటుల్
పోవన్ దీనజనావనప్రవణ! యీలోపం బెటుల్ తీరునో?

తే. ఆవిమానంబు బ్రద్దలై పోవునప్పు
డెంతశ్రమపడినావో మా కేమి యెఱుక
తలఁచినంత మాగుండె బ్రద్ద లగుచుండె
ననిన నీలోన నెంతగా వనరినావొ ? 21

తే. ఆవిమానయానంబె నిన్నిటులఁ జేసె
ననుచు లోకు లెల్లరు నాడుకొనుట కేమి ?
బ్రహ్మ వ్రాసినవ్రాఁత నెవ్వారు దాఁటఁ
గలరు తెలియరా దిట్టిసూక్ష్మంబు మనకు. 22

తే. నిన్ను విఖ్యాతచారిత్రునిం బొనర్చె
నావిమానయానంబె యన్నిదిశలందు
నట్టిప్రఖ్యాతిఁ జూచిన హర్ష మబ్బుఁ
గాని యీఘోరవార్త దుఃఖంబు నిచ్చు. 23

ఉ. ఎందఱు రాజరాజులు మహీస్థలిఁ బుట్టరు, గిట్ట రెంద ఱీ
యందముచంద మందిరె? మహాద్భుతశౌర్యవికాస శేముషీ
మందిర ! దివ్యసంపదభిమానితవాయువిమానయానజా
నందరసానుభూతిఁ గనినారలె? నీవలెఁ గృష్ణభూవరా !

శా. సవ్యస్తవ్యపథావలంబననిరీక్షన్ ధైర్యశౌర్యక్రియా
భావోల్లాసవిలాస మింపెసఁగ నీప్రావీణ్యముల్ జూపి దే
హావ్యాయామకళాకలాపములఁ బూర్ణాసక్తితోఁ బ్రోచుటల్
శ్రావ్యంబయ్యెను నీపవిత్రకథ లార్యావర్తమం దంతటన్.

శా. ఆయుర్దాయము స్వల్ప మయ్యెను భవ
త్ప్రారంభసంరంభ మెం
తో యుత్సాహము ధైర్యసాహసము ధ
ర్మోల్లాస మంచత్కళా
శ్రీయోదాయకకార్యశూరతలు పెం
చెన్ దిక్తటిం గీర్తిఁ; బూ
ర్ణాయుర్దాయ మొసంగఁడయ్యె నజుఁ డ
న్నా ! నీకు ధీశాలికిన్. 26

గీ. మేము తొలి నోఁచికొన్నట్టి నోము కొంచె
మగుట నేరీతి గొప్పపుణ్యంబు గల్గు?
కాని మీదుఘనతఁ జూచి యైన సంత
సించుచుందుము మేము జీవించుదాఁక. 27

గీ. ఈవు తలపెట్టుకార్యంబు లెల్ల సఫల
మౌట యేకాని విఫలము లౌట యెఱుఁగ;
మిప్పు డిటులౌట కొకహేతు వెసఁగునొక్కొ
దైవబలశూన్యత యొకండు దక్క వేఱ. 28

గీ. నీకు ధైర్యంబె దైవంబు నిన్ను మించు
వార లేజాడనైనను లేరు; నీవు
గొప్ప వైమానికుఁడ వంచు మెప్పుఁ గాంచు
చుండ, దుర్విధి యిటు సేసె నోర్వలేక. 29

గీ. పుణ్యకార్యముల్ చేసినపూరుషులకు
నెదురువచ్చు విమాన మోకృష్ణరాయ!
పుణ్య నిను శీఘ్రముగ స్వర్గమునకుఁ గొంచు
నరుగ హరి పంపెనె విమానవరము, నవము? 30

గీ. ఈవిమానయానము గూడు నెట్లు, నిన్నుఁ
బోలు వీరకులోద్భవభూపతులకుఁ
గాక ; యందుచే నీవు స్వర్గంబు చేరి
నా వనుచు నాత్మలోన సంతసముఁ గాంతు. 31

క. వీరుఁడవై నీవు మహా
దారుఁడ వైయుంటఁ బడయఁ దగె నీకు నృపా!
వీరస్వర్గానర్ఘ
శ్రీరతి, యిఁక నాత్మశాంతి చేకుఱు టరుదే? 32

ఉ. భార్గవునైన డీకొనెడుపఙ్జను గాంచినవాఁడ వీవు సం
సర్గముగూడ గొప్పది ప్రసన్నగుణాఢ్యుఁడ వీవు చూడఁగా
దుర్గుణమొండు నీయెడలఁ దోపదు నీకుఁ బరాత్పరుండు దా
స్వర్గసుఖంబొసంగుచుఁ బ్రశాంతినిఁగూర్చుతనీదునాత్మకున్

మ. సరసాగ్రేసరుఁడీతఁడంచును భవత్సౌందర్యము న్గాంచి ని
ర్జరవేశ్యల్ దమిఁజెంది స్వర్గమునకున్ బ్రార్థించికొంపోవఁగాఁ
గరుణన్ వారి సుఖింపఁజేయఁగ మదిన్గాంక్షించియచ్చోటికిన్
నరలోకంబును బాసి యేగితివొ కృష్ణారాయభూపాలకా!

శా. నీకీలోకమునందుఁబట్టణములన్ నిక్కంబుగా నెందునా
లోకింపన్ దగుకాంతులేమిని మరుల్లోకంబు నీక్షింపఁగా
నాకాంక్షించితివేమొ కానియెడ నీవందేగియున్నందుకే
సాకుంజెప్పఁదలంచితయ్యయిఁక గృష్ణారాయభూపాలకా!

చ. బ్రతికిననాల్గునాళ్ళు నిరవద్యవినిర్మలజీవితోన్నతిన్
బ్రతికితి వీవు, భూప్రజలభాగ్యులు, మీరు దివంబుఁజేర నే
గతి బ్రతుకంగలారమని కాలము నెట్టుట కష్టమంచు లో
నతిభయమందుచుండిరి దురంతవిషాదమహాబ్ధిమగ్నులై.

ఉ. ముప్పదిపైన నెన్మిదియుఁబూర్తిగ నిండకముందె యక్కటా
తప్పనిదయ్యె మృత్యువని తాపముగల్గెను మాకుఁ, గాని పే
రుప్పతిలంగ సద్యశమహో! దిశలందునఁబ్రాఁకఁజేసి నీ
వప్పుడె స్వర్గలోకసుఖ మందితివన్నఁ బ్రశాంతిగల్గెడిన్.

మ. కలదే కన్నులపండువైనభవదాకారంబు నీక్షింపఁగాఁ
గలభాగ్యోన్నతి స్వప్నమందయిననో కామాకృతీ! మాకు? నీ
చెలికిన్ జుట్టలకైనఁ జూపు మది వీక్షింపంగ నేతద్వ్యథా
జ్వాలనంబైన నొకింతఁజల్లఁబడుఁ గృష్ణారాయభూపాలకా!

సీ. నీకీర్తిఁ గని లోకనికరంబు చంద్రికా
శంక దూరము వారు జంకి జంకి.
నీకీరితి చకోరనికరంబు కని పండు
వెన్నెలయని చేరు వేడ్కమీఱ
నీకీర్తి కువలయనికరంబు కని జోత్స్న
యనుకొని వికసించు హర్షమొంది
నీకీర్తి పంకేజనికరంబు కని శశి
కాంతిశంక ముడుంగు వంత నొంది

గీ. చంద్రికాంతంబులును భవత్స్వచ్ఛకీర్తి
చంద్రికాలోకనంబున జాలువారుఁ
బట్టపగలైన నొక్కొక్కపట్టునందుఁ
గీర్తిధౌరేయ! ఇనుగంటి కృష్ణరాయ! 39

శా. చింతాపావకహేతిసంతతికి మాచిత్తంబు లేరీతిగా
సంతాపించిన నేమిగాని యదె రాజా! చూడు సంతానముం
జింతారత్నము కామధేనువును ని న్వీక్షించుచో నెంతగా
సంతాపించెడినో యెఱుంగుదువె? కృష్ణారాయభూపాలకా!

ఉ. తెంపున నీవిమానము నదేవనిగాఁ దలయెత్తిచూచి నీ
పెంపుడుకుక్క నిన్నపుడు వీడనిచాటను వెంబడించె నీ
పంపు శిరంబునం దిడుచుఁ బ్రాణము నీకయి కోలుపోయెఁ దా
సొంపుగనందె మోక్షము విశుద్ధచరిత్రుని నిన్నుఁ గూడుచున్.

ఉ. పిల్లలు పిల్లలైరి సతి పెద్దదిగాదు విశేషకాలమా
చెల్లఁగలే దిఁక న్మసలిచీఁకులు తల్లియుఁదండ్రియుం గటా!
మెల్లఁగ జాఱినావు మితిమీఱినదుఃఖములోనఁద్రోసి యీ
కెల్లవిధాల నో వ్వడరె నేమి వచింతును కృష్ణభూవరా!

ఉ. పుత్రులు ముగ్గురంచు నెదఁబొంగుచునుంటెను నీదుతల్లిబల్
చిత్రముగాఁగ నిర్వురు త్యజించిరి గేహము బాల్యమందె; యే
మాత్రము బెంగఁగాంచక సమర్థుఁడవైననినుం దలంచి తా
పత్రయ మొందకుండఁగడపన్ దలపెట్టె దినంబులన్నియున్.

ఉ. వారలలోన నొక్కఁడు దివంబున కేగె నటన్నవార్త గం
భీరమనంబులో నణచి బిట్టుతపించుచునుండ నంతలోఁ
జేరెఁగనిష్ఠుఁ డింటి కని చెప్పఁగ శాంతివహించె నిప్పుడీ
ఘోరదురంతవార్త విని క్రుంగదె నీజనయిత్రి భూవరా!

ఉ. ఇద్దఱుపుత్రులంచు మదినెట్టులొ ధైర్యముగాంచుచుండఁగా
పద్దశకున్ సకాలమని భావనసేయుచునుండ నంతలో
నద్దిర నీవిమాన మకటా! విధికృత్యముచేత నెట్టులో
బ్రద్దలువాఱి నిన్నుఁబడవైచెను మృత్యుముఖంబునన్ నృపా!

గీ. దైవవిధిచేత మిగిలెఁ బుత్రుఁ డొకండె
తల్లిదండ్రుల కుండుసంతాప మింత
గాదు; తనువు లుండినదాఁకఁ గలఁతఁ బెట్టు
పుత్రశోకంబునకు మేర ధాత్రిఁ గలదె?

గీ. రాజ్యలక్ష్మ్యంబకడుపునఁ బ్రభవమంది
తల్లి వీరమాత యనఁగ నెల్లప్రజలుఁ
జెప్పఁగొనురీతి ఖ్యాతి నార్జించినావు
గాని తల్లికిఁ దీఱనిగాసి యిడితి. 47

గీ. వీరపత్ని యనెడుగొప్పపేరు గాంచెఁ
గాని సహియింపరానిదుఃఖంబుతోడ
నెట్లు జీవితాంతముదాఁక నిల్చి బ్రతుకఁ
గలదు నీకాంత నీవియోగంబు సైచి. 48

ఉ. తమ్ముఁడు జ్ఞానవంతుఁడయి తాఁ జనుదెంచె గృహానకంచు, హ
ర్షమ్మును జెందినాఁడవు, ప్రసన్నగుణాఢ్యుఁ డతండుగూడఁ, జి
త్తమ్మున నిన్నుఁ జూడఁగ ముదంబును జెందె; భవత్సహోదరుం
డెమ్మెయి నొంటియాచు వసియించెడి నన్నలఁ గోలుపోవుచున్.

ఉ. ఆపరమేశ్వరుండు సముదంచితలీలల నాదరించి ని
న్నాపరమందుఁ జేర్చి భవదాత్మకు శాంతినొసంగుఁగాక! ని
న్నాపరదేవతామణియు నాపరమందున నిల్పుఁగాక యం
చేపుగఁ జేయుచుందు నెద నెప్పుడు ప్రార్థన నో నృపాగ్రణీ!

సీ. వసుదేవసుతుఁడయ్యుఁ బసులకాఁపరులతోఁ
గూడి నిరంతరక్రీడ లాడె
భూపాలకుం డయ్యుఁ బాపంబనక గోప
పల్లవాధరలతో వ్యభిచరించె

బలవంతుఁడయ్యు నబలఁ బూతనం జంపె
వృషభంబుఁ గూల్చెను వృజినమనక
గోవధం బొనరించెఁ గొలనాక, చోరుఁడై
గొల్లలపెరుగుపాల్ కొల్లగొనియె

గీ. ననుచు జనులెల్ల నిందింప యదుకులంబు
రోసి కృష్ణాకృతిని వీడి వాసిఁగోరి
వచ్చి యినుగంటివంశంబుఁ జొచ్చి కృష్ణ
రాయఁ డయ్యెను రుక్మిణీప్రాణవిభుఁడు. 51

ఉ. శ్రీమంతుండును బుద్ధిమంతుఁడుయశశ్శ్రీమంతుఁడున్ సద్గుణ
శ్రీమంతుండుఁ గవీంద్రగాయకబుధశ్రేయఃప్రదుం డూర్జిత
ప్రేమాకారుఁడు కృష్ణరాయబలవచ్ఛ్రేష్ఠుండు నీదృష్టి కిం
దామాన్యాత్ముఁడె గానిపించెనె కఠోరా! మృత్యుదుర్దేవతా!

మ. కలదే యింతటి క్రౌర్య మెందయిన నోకంజాతసంజాత! నీ
చెలికిన్ జుట్టములైనసత్కవులకున్ జేయూఁతయై సజ్జనా
వలికిన్ బ్రాపగుకృష్ణరాయనృపుసత్ప్రాలంబునం దార! నీ
కల మేరీతి లిఖింపఁగల్గె నిటు స్తోకంబైన యాయుష్యమున్?

ఉ. 'వీరుఁడు కృష్ణరాయపృథివీపతి యింకను గొన్నివత్సరాల్
ధారుణి నిల్చియున్న ననుఁ దప్పకమీఱు,నగణ్యపుణ్యసం
భారసమగ్రసంగ్రహణపద్ధతి నాపద మాక్రమించు' నం
చోరువలేక యాతని నయో! కొనిపోయితివే శచీపతీ!

* * *

గీ. ఆధియో యిది, కొండొక వ్యాధియొకొ,
యమ్మ! నోరాడఁ బోదు నీయార్తిఁ దలఁప;
నెట్టు లోదార్ప నగు నాకు నింక నిన్ను?
నో సరస్వతి! యోదార్పకుందు నెట్లు? 55

గీ. ప్రాణపతి నిన్ను విడి యేగె నంచుఁ గంట
నీరు వెట్టకు వెత నహర్నిశము నిటుల;
ఆర్తి యొకనాఁటితోఁ దీఱునట్టి దగుటఁ
దల్లి! నీలోనె దిగమ్రింగఁదగును సైచి. 56

ఉ. పిల్లలఁ జూచుకొంచుఁ గడు బెంగను జెందక కాలమెట్టులో
మెల్లగ నెట్టు మమ్మ! మితిమీఱిన భక్తిని నారమేశుఁడే
యెల్లెడ దిక్కటంచు మది నెంతయు నమ్ముము దాన నెట్టులోఁ
జెల్లును గాల మంతయును, జేకుఱు ధైర్యము జీవయాత్రకున్.

ఉ. పుట్టినవారి కెల్లరకు ముందుగనో మఱికొంత వెన్కనో
గిట్టుటగూడఁ దప్ప దనుగీతి మదిం దలపోసి కాలమున్
నెట్టినచో సుఖంబు ధరణిన్ లభియించు, విచార మొందుచోఁ
గిట్టినవారు వత్తురె? లగింపుమ ధైర్యము నెట్టులేనియున్.

ఉ. ఆపదలందు ధైర్యగుణ మంచితధర్మమటం చెఱింగి మీ
రీపగిదిన్ విచారము నొకింతయుఁ బాయక యుంట న్యాయమే
కాఁపురముండ వెన్నఁడును గష్టము లెల్ల నొకేవిధమ్మునన్
శ్రీపరమేశ్వరుండు గనఁ జేయుత ధైర్యము జీవయాత్రకున్.

ఉ. రాజగు కృష్ణరాయగుణరత్నము నన్ను బహూకరించె మీ
కోజఁ బ్రియమ్మునన్ నుడివె, నూర్జితభక్తిని బాదుకొల్పి వి
భ్రాజితలీల నన్ను గురువర్యునిఁజేసి కృపన్ వహింపఁగా
రాజితగౌరవోన్నతి నిరంతరమున్ గనుచుంటి నమ్మరో!

ఉ. ఆమహనీయుదర్శనమె యంతటితో సరిపోయెఁగాని త
ల్లీ! మఱి వారికంటెను ననేకవిధమ్ముల నన్ను మీరు సు
శ్రీమహితుంబొనర్తు; పొనరించుచునుంటిరి; లోటులేదు; కా
నీ, మది యేలొకో జడతనే వహియించి కృశించి కుందెడిన్.

* * *

ఉ. తల్లిరో! రత్నమాంబరో యెదన్దగు ధైర్యముగాంచుమమ్మ! నీ
కొల్లనివంత యేర్పడియె; నొక్కట శాంతి యొసంగ; దైన నీ
వల్లనె వృద్ధిగాఁగలుగుబాధ్యత కన్పడుచుండెఁ గాన నీ
పిల్లలఁ జేరఁదీసి యభివృద్ధికి మార్గముఁ జూపు మమ్మరో!

గీ. ప్రజలకై పాటుపడుచున్న రాణి వీవు
తత్త్వ మెఱిఁగిన విజ్ఞానధన్య వీవు
కాన విధివశమునఁ గల్గుకష్టములకుఁ
గలఁత నొందంగ రాదంచుఁ బలుకవలెనె? 63

గీ. అమ్మ! రాజ్యలక్ష్మ్యమ్మ! నోరాడ దమ్మ!
యేమి చెప్పుటకును గాని యెట్టులేని
ధైర్యమందుమ నీకుఁ బుత్రికుఁ డొకండె
కల్గినాఁ డంచుఁ గడవుమ కాల మెటులొ. 64

9. సహృదయానుతాపము

శ్రీరాజా వేంకటకృష్ణారావుబహద్దరుగారు స్వర్గతులయిన కొలఁదిదివసములకే తద్వియోగదుఃఖితులగు ననేకోద్యోగులును, సహృదయులును, పౌరజానపదులును గొల్లాపురమునందలి శ్రీలక్ష్మారాయ మిడిల్‌స్కూలునం దొక బహిరంగమహాసభ గావించిరి. పట్టరాని తమ దురంతసంతాపమును బ్రముఖులు బహుసంఖ్యాకులు బహుముఖముల బహుభాషల వ్యక్తీకరించిరి. అప్పుడు సంగ్రహింపఁబడిన రచన లిందుఁ బ్రకటింపఁబడుట యుక్తమైనను గ్రంథవిస్తరభీతిని ముఖ్యములగు కొన్నిమాత్రి మీఁక్రిందఁ బ్రకటింపఁబడినవి. మఱియుఁ బట్టణాంతరములనుండి శ్రీవారి పరిచితాపరిచిత పండితకవులు వ్రాసిపంపిన పద్యములుగూడ నిందుఁ బ్రకటింపఁబడినవి.

*　　　　*　　　　*

అధ్యక్షోపన్యాసము

(ఉర్దునకు ననువాదము)

ఈమీాటింగు శ్రీజటప్రోలుమహారాజ్ఞిగారి రెండవయల్లుఁడుగారగు శ్రీరాజా ఇనుగంటి వేంకటకృష్ణారావు బహద్దరుగారి యకాలమరణమునెడ ననుతాపము తెలుపుకొనుటకై యేర్పడినదగుటచే నిట్టిమనోవేదన కలిగించు సం

దర్భమున నే నేమిచెప్పుటకును నోరాడకున్నది. వైకుంఠవాసులగు శ్రీరాజాగారిజననము, విద్యాభ్యాసము, వివాహము, పరోపకారము మొదలగువిషయము లన్నియు వక్తలందఱు విమర్శగఁజెప్పియున్నారు. అందు ముఖ్యముగా మహారాజశ్రీ రామచంద్రరావు మునిసిఫ్‌సాహేబుగారు ప్రతివిషయమునుగూర్చి విపులముగ గంభీరోపన్యాస మిచ్చియుండిరి. ఇంతకంటెఁ జెప్పుటకు విశేషములు లేవు. కాని చర్విత చర్వణమైనను నాకృతజ్ఞత క్లుప్తముగ వెల్లడించుకొందును.

శ్రీరాజాబహద్దరుగా రొకగొప్పదాత. బీదసాదల కెంతయుఁ జేయూఁతనిచ్చుమహారాజు. మిక్కిలి తృప్తిగలవారు. పౌరుషజీవి. శౌర్యధైర్యసాహసముల కునికిపట్టు. వాయువిమానములను నడుపుటలోఁగల యద్భుతసాహసము, చాకచక్యము, తెలివి వర్ణింపఁ దరముగాదు. మనహిందూదేశములో నిట్టికళలో నారితేఱినవారు ముగ్గురు. మొదటివారు శ్రీకేశవరావుగారికుమారుఁడు. రెండవమహనీయులు వీరు. మూఁడవవారు బాబర్‌మీర్జాసాహేబుగారు. వాయువిమానములను నడుపునుత్సాహమే శ్రీవారిశౌర్యమునకు నిదర్శనము. వేయేల? వీరు పరిమితిగల యీమానవజీవితములో సంశయవృత్తి, భయము కలవారు కారు. మరణము ప్రతిజీవికిని నెన్నటికైనను దప్పదు. కాని యిట్టియకాలమరణము దుర్భరము. వార్ధకమున మరణించినచో విచార మంతగ నుండదు. ఇట్టి లేఁబ్రాయములో నిట్టి మహావీరునిమరణము శోచనీయము. ఇది దైవికము. శ్రీమహారాజ్ఞిగారికిని

శ్రీరాజకుటుంబమువారికిని శ్రీభగవంతుఁడు తగినంతధైర్య మిచ్చుఁగాత. శ్రీరాజాబహద్దరుగారి కాత్మశాంతి కలుగుఁ గాత.

కటికినేని రామచంద్రరావుగారు,

మునిసిఫ్ & మేజస్ట్రీటు,

కొల్లాపురము.

అధ్యక్షమహాశయా ! ఆర్యులారా !

శ్రీ శ్రీ రాజా ఐ. వి. కృష్ణారావుబహద్దరుగారి యకాలమరణము ప్రారంభమునఁ గలలోనివార్తవలెఁ దోఁచినది. ఇది నిజమని తెలిసినప్పుడు దుఃఖించని మానవుఁడు లేఁడు.

శ్రీవారు 19 సంవత్సరముల ప్రాయమునఁ గొల్లాపురమునకు వచ్చిరి. శ్రీ జటప్రోలుసంస్థానాధీశులగు శ్రీ శ్రీ వేంకటలక్ష్మారావుబహద్దరుగారికి మేనల్లుఁడగుటయేగాక జామాత యగుభాగ్యమును వీరు పొందిరి. సంస్థానమునకును శ్రీవారికిని గలయీనూతనసంబంధమె యిక్కడిప్రజలకు శ్రీవారితోఁ బరిచయము గలిగించినది. శ్రీవారి నిష్కపటహృదయము, సత్యసంధత, దాతృత్వము, న్యాయవిచక్షణ, నిరాడంబరజీవితము, సాటిలేనిశూరత్వము - వేయేల శ్రీవారియందుఁ గలసద్గుణపుంజములె యిక్కడి ప్రజల

హృదయములో శ్రీవారియెడల వినయవిధేయతలు, భక్తి విశ్వాసములు కల్పించినవి. ఇక్కడి ప్రజలకు శ్రీవారి యందుఁ గలవాత్సల్యము మానసగోచరమేకాని చెప్ప నలవికాదు. శ్రీవారిసద్గుణములు లోకవిదితములు. శ్రీవారి వియోగపరితాపముచే నిండియున్నహృదయముతో నే నిప్పు డేమి చెప్పఁగలను? శ్రీవారితోఁ గలసి మాట్లాడిన వార లెల్లరు వా రేతరగతి యేజాతిమతమునకుఁ జెందిన వా రైననుసరే సారెసారెకు దర్శింపవలయుననియే కోరు చుండెడివారు. వా రొకరియాపదను జూచి సహించలేకుం డిరి. బీదలపాలిటి కల్పవృక్షము. విద్యార్థు లనేకులు శ్రీవారి సాహాయ్యముచే విద్య నభ్యసించుచుండిరి. నిరుద్యోగు లుద్యోగములను సంపాదించుకొనుచుండిరి. అన్నవస్త్రము లకుఁ దల్లడిల్లువారు సుఖజీవనమును బడసిరి. ఈనిదర్శనం బులు శ్రీవారియుదారగుణదాతృత్వములను జెప్పక చెప్పు చున్నవి. కొల్హాపురమే జన్మభూమిగా భావించి తత్ప్రజల యభివృద్ధికై శ్రీవా రెన్నియోవిషయములను యోజించు చుండిరి. సంస్థానప్రజలకు ముఖ్యముగా వెలమవిద్యార్థులకు నున్నతవిద్యను గఱపుట కెంతయో చేయూఁత నిచ్చుచుండిరి.

శరీరబలము, శౌర్యము, సదయత ప్రపంచములో నేజాతియందు లేదో యది స్వతంత్రతను గౌరవమును సంపాదించుకొనలేదనియు, నున్నదానిని నిలుపుకొనఁజాల దనియు శ్రీరాజావా రెఱింగియుండిరి. బాలుర కిట్టిగుణము లలవడుటకై నూతనపురాతనానేకక్రీడావకాశములు శ్రీవారే

తగినప్రోత్సాహ మిచ్చి కల్పించియుండిరి. శ్రీవారు సహజశూరశిఖామణు లగుటచేఁ బ్రపంచ మంతయు శౌర్యగుణసంపద్విభవాభిరామముగ నొనర్పవలయునని సమకట్టియుండిరి. బాల్యమునుండియు శ్రీవారికి శూరక్రీడలయందాసక్తి మెండు. నేఁటినాగరకతకు సంబంధించినయాటలన్నిఁటియందును శ్రీవారు ప్రవీణతఁ గాంచియుండిరి. గుఱ్ఱపుసవారియందు వీరికిఁగలనేర్పు వర్ణనాతీతము. 'పోలో' మంచిగ నాడెడువారు. వేఁటలో నసమానప్రజ్ఞ గలవారు. పులివేఁటలో శ్రీవారి పరాక్రమప్రదర్శనము చూచినవారిని విన్నవారినిఁగూడ నాశ్చర్యమగ్నులఁ జేయకమానదు. సిద్ధారంచెఱువునకు సమీపమునం దొకయరణ్యప్రాంతమున నొకప్పు డొకబెబ్బులిని రాత్రియందు సంహరించిరి. ఆపులి యాదెబ్బకుఁ జచ్చియుండలేదని నౌకరులు సంశయింప శ్రీవారే స్వయముగ నిర్భయముగ నొంటరిగ దానిని సమీపించి దగ్గఱ నున్నవారికిఁ జూపించిరి. ఇది సాహసములలో సాహసమనక తప్పదు. మఱియొకపర్యాయము సంస్థానముసమీపమున నున్నయడవులలో భూమిపైఁ గూర్చుండియే మిక్కిలి సమీపించిన పులిని గాల్చిరి. అది మాటులో దూఁకి రెండవదెబ్బతోఁ బ్రాణములను వదలెను.

శ్రీవారు సైనికశిక్షను బొందియుండిరి. శ్రీవారిశౌర్యమే శ్రీవారిదృష్టిని వాయువిమానములపైకిఁ ద్రిప్పెను. కొలఁదిదినములకే శ్రీవారు విమానములను స్వయముగ

నడవుశక్తిని గాంచిరి. అచిరకాలమున దానిలో గొప్ప ప్రజ్ఞావంతు లన్నకీర్తిని సంపాదించుకొనిరి.

శ్రీవా రొకప్పుడు 'అలహాబాదు' నకు విమానములోఁ బోవుచుఁ దుపానులోఁ జిక్కుకొని తప్పించుకొనిరి. విమానయానము ప్రమాదకరమగువిషయమని శ్రీవారెఱుంగనిది కాదు. కాని శ్రీవారి సహజపరాక్రమము శ్రీవారి దృఢసంకల్పమునుండి మనస్సును జలింపనీయకుండె.

శూరుఁడు తనజీవితములో నొకసారియే మరణించు ననియు, దానికొఱ కొకసమయము నిర్ణయింపఁబడియున్న దనియు, నది తప్పదనియు, నందుకై చింతింప నవసరము లేదనియు శ్రీరాజావారు తరచుగ సెలవిచ్చుచుండెడివారు.

ఇట్టి శ్రీవారినిఁ గన్నతల్లియే వీరమాత. చేపట్టిన యర్ధాంగలక్ష్మియే వీరపత్ని. శ్రీరాజావారిచే దేశమున కెంతయో మహోదయము కలుగవలసియుండె.

ఇట్టిమహావీరుని, మహాదాతను, సుగుణరాశిని గోల్పోవుట దేశముయొక్క దౌర్భాగ్యము. వేయేల? శ్రీరాజావారి యకాలమరణముచే శ్రీరాజకుటుంబమువారికే కాదు; ఆంధ్రదేశమునకు ముఖ్యముగాఁ బద్మనాయకజాతికిఁ దీఱని నష్టము వాటిల్లినది.

భగవంతుఁడు శ్రీవారియాత్మకు శాంతి ననుగ్రహించుఁ గాక !

వలిపె వేంకటరావుగారు,

హైకోర్టువకీలు, కొల్లాపురము.

శ్రీరాజా ఇనుగంటి వేంకటకృష్ణారావుబహద్దరుగారు మనకుఁ జిరస్మరణీయులు. 'జాతస్య మరణం ధ్రువ' మను వార్యోక్తి ననుసరించి ప్రతిజీవికిని జన్మించినతరువాత మరణించుట సహజమైయున్నది కాని, యొకపరోపకారదీక్షాపరతుఁడును, ధైర్యసాహసఖనియు, నుదారగుణసంపన్నుఁడును, సర్వకలాకోవిదుఁడును, నపూర్వప్రజ్ఞాసమన్విత మేధావియు నగు మహారాజచంద్రుఁ డకాలమరణమునకు గుఱియగుట ప్రజాదౌర్భాగ్యముగాక వేఱుకాదు. నిష్ప్రయోజకు లగుమనుష్యపశువులు లక్షలుగ నుండి భూమికి భారము గల్పించుటకన్న శ్రీరాజావారివంటిసద్గుణగణగరిష్ఠుం డొకఁ డున్ననుజాలు. ఇట్టిమహనీయు లుండుట విశ్వంభరాకాంతకు భాగ్యోదయ మనక తప్పదు. ఈకారణమువనే శ్రీవారిమరణము దుస్సహము. అన్నిఁటికన్న శ్రీరాజావారివిమానయానము శ్రీవారిసహజశౌర్యంబును గాంభీర్యపటిమమును బ్రదర్శించెడిని.

ఆబాలగోపాల మిచ్చట నీసమయంబున గుమిగూడి తమతమవిషాదమును వెలిపుచ్చుటయును, నేతన్మరణానంతరమింతదనుక వివిధపత్రికాలోకవిచారనిర్వచనంబును శ్రీవారియఖండశేముషీవిభవాతిశయంబులకుఁ దార్కాణము. వివిధదేశీయసార్వజనసంశ్లాఘ్యుం డగుమనరాజచంద్రుని మరణోదంతము మఱపురానిది.

"అస్థిరం జీవితం లోకే । హ్యస్థిరం ధనయౌవనమ్
అస్థిరం దారపుత్రాద్యా । ధర్మకీర్తిద్వయమ్ స్థిరం".

అనునభియుక్తోక్తిప్రకారము శాశ్వతములగు ధర్మకీర్తులనే ప్రధానలక్ష్యములుగ భావించి ధనయౌవనదారపుత్రాదికమంతయు క్షణభంగురమని యెంచి జీవితకాలమంతయును గడపి ధర్మపథానువర్తియై కీర్తిసంపన్నుఁడగు మనరాజచూడామణిని గోల్పోవుట దుర్భరముగదా. శ్రీపరాత్పరుఁడు శ్రీరాజావారికి వైకుంఠపదప్రాప్తియుఁ దదాప్తజకుటుంబమునకుఁ జిత్తశాంతియు ననుగ్రహించుఁగాత.

మహమ్మద్ అబ్దుల్ ఖయ్యూమ్ సాహేబ్,

హైకోర్టువకీలు, కొల్లాపురము.

(ఉర్దునకు ననువాదము)

ఈసమావేశము కీ॥ శే॥ శ్రీరాజా ఐ. వి. కృష్ణారావు బహద్దరువారి స్మరణసంబంధమైనది. శ్రీరాజావారు వర్తమానకాలమున లోకప్రసిద్ధిఁగాంచిన సర్వకళానిపుణులలో నగ్రగణ్యులు. శ్రీవారొకసామాన్యవాతావరణగతప్రదేశమున నివాసముచేయుచున్నవారయ్యు నపూర్వవైజ్ఞానికనాగరకతావిశేషపూరిత మగువాతావరణము గలయనేకపట్టణములయందలి ముఖ్యస్థలమహాకార్యక్రమములయందుఁ బాల్గొనుటయే వారి వైదుష్యమును సర్వకలాకోవిదత్వమును విజ్ఞానమును స్పష్టపఱచుచున్నది. తలవనితలంపుగా

స్వల్పకాలములో వీ రొక మహాశ్చర్యకరమై నూతనసృష్టి యైన విమానయానమునందు నారితేఱిన నేర్పరులై పరిపూర్ణానుభవమును సంపాదించిరి. ఈవిమాన మనుపేరు మాత్రము మనదేశమందు వినుచుఁ దత్సందర్శనకుతూహలులై, యాందోళనాపరవశులై యుండిన ప్రజలదృష్టిపథమ్మునకు శ్రీవారు సంకల్పసిద్ధిరీతిగా నీయపూర్వదృశ్యమును బ్రదర్శనమాత్రమునఁగాక పిన్నపెద్దలగు దేశీయప్రజాసోదరుల కెల్లరకు భగవానునిసృష్టివైచిత్ర్యమును మానవుని కలానిపుణత్వమును స్పష్టీకరించిరి. శ్రీవా రెప్పుడును బరోపకారము ప్రజాసౌకర్యము ధర్మవర్తనము సత్యసంధత మొదలగు సుగుణగణములను దృష్టిపథమున నుంచుకొని ధైర్యమే ప్రధానభూషణముగఁ దాల్చి సంచరించిరి. వీరి కీర్తి ఖండాంతరములకుఁగూడఁ బ్రాఁకినది. వీరిపవిత్రజీవితమును గుఱించియు సాహసమరణమును గుఱించియుఁ బ్రసిద్ధి దిశావలయంబున వ్యాపించెను. ఈసుప్రసిద్ధకీర్తి శాశ్వతముగ నుండఁగలదు. భగవంతుఁడు ప్రతిమానవునకు నిట్టిమరణానంతర ప్రశంసాపూర్వక మగుమృత్యువునే ప్రసాదించుఁగాత. కాని యీసందర్భమున శ్రీరాజావారు మధ్యమవయస్కులగుట వీరి మరణమునకు మాత్రము చింతిల్లక తప్పదు. భగవానుఁడు శ్రీవారికి వైకుంఠమును బ్రసాదించుఁగాత. తద్రాజకుటుంబమువారికిఁ దగిన ధైర్యము చేకూర్చుఁగాతమని యభిలషించుచున్నాఁడను.

కటికినేని ఉమాపతిరావుగారు, బి. ఏ., కొల్లాపురము.

(ఉర్దునకు ననువాదము)

శ్రీరాజా ఇనుగంటి వేంకటకృష్ణారావుబహద్దరుగారి యకాలమరణము మిక్కిలి శోచనీయమైనది. శ్రీవారి మరణము కొల్లాపురవాస్తవ్యులకును శ్రీరాజకుటుంబమువారికినే గాక ప్రపంచ మంతకును దీఱనివిచారమును గొఱఁతను గలిగించినది. ఒకసామాన్యవ్యక్తి మరణించినచో నంతగా విషాదహేతువు కాకపోవుట యటుండఁ బ్రపంచమంతయు దుఃఖింపవలసినకారణ ముండదు. దేశాభివృద్ధికి మహాపురుషులజీవితము ముఖ్యము. అందు శూరశిఖామణు లాదర్శపురుషులు. ఒకదేశభక్తుఁడుగాని, ఒకమహావీరుఁడుగాని, ఒకయాదర్శపురుషుఁడుగాని మరణించిన దేశమున కెంతయు లోపమే. మనరాజా కృష్ణారావుబహద్దరువారాతరగతికిఁ జేరినవారు. శ్రీవారి పరాక్రమము, సాహసము, పరోపకారబుద్ధి, వితరణశక్తి, యుదారభావము దిగంతముల మాఱుమ్రోగె. అట్టిఘనుని యకాలమరణమునకు లోకము శోకించదా? వేఁటయందు వీ రద్వితీయులు. విమానములను నడపుటయందును వేమేల సర్వకళలయందును, వీరారితేఱినవారు. వీరి ప్రతిజ్ఞయుఁ బ్రతిభావిశేషములును గొప్పవి. వీరు చేపట్టిన ప్రతికళయందును లోకమున మొదటివారుగఁబరిగణింపఁబడవలయునన్నమహాశయముతోఁ బట్టుదలతోఁ బ్రాణ మర్పించియైనను విడువక పనిచేసి యందట్టివిజయమును గాంచుచుండెడివారు. 'ఇది అపాయకర

మగువిషయము; ప్రాణహాని కలుగు' నని తెలిసినసంగతి యైనను శ్రీరాజావారి ధైర్యము వీని నన్నింటిని గెంటఁగల శక్తికలది. ఇదియేకదా శౌర్యము. ప్రాణ మేనాఁటికైనను నంతమొందునదె. అందు వీరకార్యములయందు జీవితమంత మొందినచో జన్మము సార్థకమగునుగదా. శ్రీరాజావారి యాత్మవిశ్వాస మింతదృఢమైనది. ఇట్టిమహనీయు లుద్భవించుటచేతనే దేశాభివృద్ధియు, నవనాగరకతయు హెచ్చుచున్నది. శ్రీరాజావారి యకాలమరణముచే నేఁడు ప్రపంచదృష్టిలో శ్రీవా రాక్రమించినస్థానము మఱియొకనిచేఁ బూర్తిచేయఁబడదన్న నెంతటినష్టము లోకమునకుఁ గలిగినదో యూహింపరానివిషయమని సర్వు లెఱింగినదే. భగవానుఁడు శ్రీవారి యాత్మకు శాంతిఁ బ్రసాదించుఁగాక!

"One crowded hour of glorious life
Is worth an age without name."

* * *

బ్రహ్మశ్రీ వనం సీతారామశాస్త్రిగారు
శ్రీజటప్రోలుసంస్థానపండితులు.

శ్లో. విమానచరసంసేవ్యం । సన్మాన్యం సత్యసంగరమ్
కృష్ణం భూతదయాసక్తం । స్మరంతు హితకాంక్షిణః.

భరతఖండమున విమానచారులలో నగ్రగణ్యులని ప్రసిద్ధిఁగాంచి భూలోకధీరశిఖామణి యని యెన్నఁదగిన ధైర్యప్రతాపశాలియగు శ్రీరాజా ఇనుగంటి వేంకటకృష్ణారావుభూపతి విమానచారియై భూలోకము వదలి స్వర్గమలంకరించెననెడి కర్ణకఠోర మగువార్త వినవలసివచ్చెఁ

గదా. సుకృతీ గతాయుః- పుణ్యాత్ములు దీర్ఘాయుష్యము గాంచి జీవించుట దుర్లభము- ఇట్టి ఘోరవార్తను విని జనులెల్లరు మితిలేనిదుఃఖమున మునుంగుచుండ నామహనీయుని భృత్యమిత్రాశ్రితవర్గసంతాపమునకు మేర యెక్కడిది? ఇట్టిమహాత్ముని గోల్పోయిన తదీయపుత్రకళత్రబంధుసమితికి శోకసాగరమునకుఁ బార మెయ్యది? "ప్రతికూలతాముపగతేహి విఫలత్వ మేతి బహుసాధనతా" అనున్యాయమున దైవము ప్రతికూలుఁడైనప్పుడు బాధించకుండ నెంత సాయ మున్నను గార్యము కొనసాగదు. విమానసారథి యసమాననైపుణ్యశాలియని పేరు మోసినవాఁడు. ఎట్టి ప్రమాదమైనను దొలఁగింపఁగలసమర్థత గలవాఁడు. ఇట్టి చతురసారథిసాహాయ్యము గలిగి తా మం దతి నిపుణులై యుండియుఁ బ్రమాదమును దప్పించుకొనలేకపోవుట దైవకార్యమనియే చెప్పవలయును. "అధీత మధ్యాపిత మార్జితం యశః" అనునట్లు శ్రీరాజాగా రసమానధైర్యప్రతాపశాలియై పుత్ర,పుత్రికాసంపద నొంది ధర్మార్థకామము లైన త్రివర్గములఁ బరిపూర్ణముగ సాధించిరి. సావిత్రి, అనసూయ, అరుంధతి మొదలగు సతీరత్నములకక్ష్యలోఁ జేరి ప్రసిద్ధిఁ గాంచిన వీరియర్ధాంగలక్ష్మి కిట్టిపతివియోగదుఃఖ మేర్పడుట పూరాకృతపరిపాకము! శ్రీమహారాజ్ఞిగారికి మనశ్శాంతి కలుగుఁగాక! జగదీశ్వరుఁడు శ్రీరాజాగారి కాత్మశాంతియు, రాజకుటుంబమునకు శ్రేయఃపరంపరయు నొసంగుఁగాత మని ప్రార్థించుచున్నాను.

బ్రహ్మశ్రీ అచ్యుతుని వేంకటాచలపతిరావుగారు, గుంటూరు.

శా. శ్రీవిద్వద్గణసేవ్యమానచరణా !
చింతామణీప్రాభవ
ప్రావీణ్యాదిగుణాంబుధీ ! సకలభూ
పాలావళీవందితా !
'నావిష్ణుః పృథివీపతి ర్హి' యను న్యా
యం బొప్ప దేదీప్యమా
నావిర్భావతనూవినూతనకళా
ఢ్యా ! కృష్ణరాయప్రభూ !

ఉ. హావవిశేషలబ్ధమృగయాఖగయానవిహారలోలుపం
బై విలసిల్లుపావనహృదంతరధైర్యరమావిలాస మీ
కేవలభూమినాయకులకే తరమావని కాదుకాని మీ
చేవకుఁ దావలంబయి ప్రసిద్ధిని గూర్చెను గృష్ణరాణ్మణీ !

గీ. ఆయు వొక్కటే చరితార్థ మయ్యెనేని
పాము వేయేండ్లు బ్రతికినఫలముగలదె ?
కులుకులాడికొప్పున మల్లెకులికి యాడి
క్షణములో వాడినను జన్మసార్థకంబు. 3

గీ. మీజీవితాశయము నీ
రేజాతప్రేంఖదిందురేఖానిభమై
తేజోవంతుల కాయువు
తో జోక్యము లేదటన్నధోరణిఁ జాటెన్. 4

సీ. మట్టి మున్నూ ఱేండ్లు మనఁజాలినను గూడ
నేటి కెండెడుమల్లిసాటి రాదు
మిడత యెప్పుడు మిట్టి మిడిసిపడినఁగూడ
మిణుకుమక్ మిణుగురుఘనత రాదు
తాళమూలమ్ము పాతాళ మూపినఁగూడఁ
వేలెడుకురువేరుఁ బోల రాదు
గొంతు చించుక కాకి గోలవెట్టినఁగూడఁ
గాత్రె కళచుపికస్ఫూర్తి రాదు

గీ. జీవ మున్నంతదాఁక మైచేవఁ జూపి
యస్తమించిన దొకటె కృతార్థజన్మ
యాయు వెంతైన శ్రీకృష్ణరాయభూప!
మెఱపుఁదీగవై మింటిలో మెఱసి తౌర!

ఉ. భండనభీమ వైరినరపాలకకంఠవిలుంఠనక్రియా
మండితవీరవర్యు నభిమన్యుని హెచ్చుగ మెచ్చినట్లు లు
ద్దండక్రియావిహీనబహుదంభవచస్కవిరాటరాట్కుమా
రుం డానరించుకార్య మెవరుక్ గణుతింతురె? కృష్ణభూవరా!

సీ. అడుగు చాలిమ్మన్న నడుగంటఁ బడినట్టి
బలిదానదీక్షలో బలము లేదు
జలుబునీళ్ళను రాల్చి తెలతెల్లపోవుమే
ఘుని ధర్మనిష్ఠకు ఘనత రాదు

పారిఁతచూకొక్క నిచ్చుపాటికే ఋగింగుక
ర్ణత్యాగపటిమ సార్థకము కాదు
తిమితిమింగిలములం దీర్చి వాకిట నిల్పు
జలధిదాతృత లాభ సరికిఁ బోదు

గీ. విన్న వెన్ని కన్నారంగఁ గన్న వెన్ని
కాని యివి పుక్కిటిపురాణగాథ లయ్యె
ధన్యమూర్ధన్య మైనమీదానధర్మ
ధాటి కివి కృష్ణభూవరా! సాటి రావు. 7

సీ. శ్రితలోకరక్షణాశ్రితకీర్తి వివరింప
గజరాజరక్షణఖ్యాతి సాటి
ఆర్యసంస్తవనీయకార్యశూరతఁ జూడ
నాభగీరథయత్నశోభ సాటి
శరణాగతత్రాణనిరతిని వర్ణింప
ఫల్గునోత్సాహసంపదలు సాటి
శాంతనిర్మలనిజస్వాంతదీప్తి గణింప
సాంబశివాంతరంగంబు సాటి

